మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

తెలంగాణ అస్తిత్వం బీఆర్‌ఎస్

స్వరాష్ట్ర సాధన గమ్యాన్ని చేరాం

పదేండ్ల పాలనలో ప్రగతి ఫలాలు

పార్టీ శ్రేణులకు ఆవిర్భావ శుభాకాంక్షలు: కేసీఆర్ › 5



ఉద్యమమే ఊపిరిగా..

పదేండ్లు మినహా తక్కిన కాలమంతా రణగర్జనే

చీల్చిన చోటే.. చిచ్చరపిడుగులా కేసీఆర్ మహాగర్జన

నేడు బీఆర్‌ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవం › 5

శనివారం SATURDAY 27.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12 + 4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 323 ‖ వెల (Price) రూ.6.50 | తదియ

సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-35. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత ఋతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: తదియ ఉదయం 8-18 వరకు. నక్షత్రం: జ్యేష్ఠ తెల్లవారుజామున 4-28 వరకు. వర్జ్యం: ఉదయం 9-28 నుంచి ఉదయం 11-04 వరకు. రాహుకాలం: ఉదయం 9-02 నుంచి ఉదయం 10-37 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-52 నుంచి ఉదయం 6-42 వరకు. అమృతకాలం: రాత్రి 7-21 నుంచి రాత్రి 9-00 వరకు. శుక్ర మౌఢ్యం ప్రారంభం.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

చోటే భాయ్ దగా బడే భాయ్ పగ





లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు భారీ సంఖ్యలో హాజరైన జనసమూహం

వివరాలు 2,3 పేజీల్లో

తెలంగాణను నాశనం చేస్తామంటే యుద్ధమే

రాష్ర్టానికి ఏమీ ఇవ్వని బీజేపీకి ఓటేయొద్దు

నా చివరి శ్వాస వరకు సెక్యులర్‌గానే ఉంటా

ముస్లింలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీ గెలుస్తుంది

మహబూబ్‌నగర్ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ చీఫ్

నరేంద్ర మోదీ 100 నినాదాలు ఇచ్చిండు.. ఒక్క నినాదమన్న నిజమైందా?

డిజిటల్ ఇండియా జరిగిందా?

అచ్ఛేదిన్ వచ్చిందా? సచ్చేదిన్ వచ్చిందా?

మోదీ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇచ్చిందా?

ఆత్మనిర్భర్ భారత్ అయ్యిందా?

జన్ ధన్ యోజనతో ఏమన్న లాభం జరిగిందా?

ఫసల్ బీమా ఏ రైతుకైనా వచ్చిందా?

ఎవరికైనా రూ.15 లక్షలు వచ్చాయా?

మరి అసుంటి బీజేపీకి ఓటెందుకు వేయాలె?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలైంది.

రైతుబంధు కేసీఆర్ 10 వేలు ఇస్తాండు, నేను 15 వేలు ఇస్తా అని చెప్పారు. మరి వచ్చినయా?

కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తాండు, మేము తులం బంగారం ఇస్తమన్నరు.. ఇస్తున్నరా?

మహిళలకు నెలకు రూ.2,500 వస్తున్నయా?

ఆసరా పింఛన్ 4 వేలు అయిందా?

ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారా?

రెండు లక్షల రుణమాఫీ అయ్యిందా?

వడ్లకు 500 బోనస్ ఇస్తున్నారా?

తెలంగాణ నా కండ్ల ముందే నాశనం అయిపోతే, చూస్తూ ఉరుకోవాల్నా? యుద్ధం చేద్దామా? కొట్లాడుదామా? అందరూ తయారుగా ఉండాలె - కేసీఆర్

సూర్యాపేటలో రైతుల ఆందోళన

- కాంటాలు వేయాలని అన్నదాతల ధర్నా
- సమస్యల పరిష్కారానికి హమాలీల సమ్మె
- వ్యవసాయ మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు › 8





ఉచ్చెంతల శ్రీను (ఫైల్)



అనంతయ్య (ఫైల్)

ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

జనగామ, వికారాబాద్ జిల్లాల్లో ఘటనలు › 4



రైతుబంధు ఏమైంది సీతక్క?

3 ఎకరాలకూ పడలేదని రైతు ఆగ్రహం

బ్యాంకు లోపం కావొచ్చని చెప్పి వెనుదిరిగిన మంత్రి › 4



మాజీ దంపతుల అమీతుమీ!

విష్ణుపూర్: బెంగాల్‌లోని విష్ణుపూర్ లోక్‌సభ సీటు కోసం ఈసారి సిట్టింగ్ ఎంపీ సౌమిత్రా ఖాన్ (బీజేపీ), ఆయన మాజీ భార్య సుజాతా మోండల్ (టీఎంసీ) పరస్పరం పోటీపడుతున్నారు. గతంలో హైకోర్టు విధించిన నిషేధం వల్ల సౌమిత్రా ఖాన్ బంకురా జిల్లాలో ప్రవేశించేందుకు వీల్లేకపోవడంతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన తరఫున భార్య సుజాతా మోండల్ ప్రచారం నిర్వహించారు. దీంతో ఆయన విష్ణుపూర్ నియోజకవర్గం నుంచి 78 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో రెండోసారి ఎంపీగా గెలిచారు. అప్పటికి భర్తతో కలిసి బీజేపీలోనే ఉన్న సుజాతా మోండల్ కాల క్రమంలో టీఎంసీలో చేరాలని నిర్ణయించుకోవడంతో 2020లో ఆ దంపతులు విడాకులు తీసుకున్నారు. గత ఐదేండ్లలో వారి వ్యక్తిగత, రాజకీయ సమీకరణలు మారిపోవడంతో ఇప్పుడు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటున్నారు.

250 సీట్లయినా దాటేనా?



కమలానికి సీట్లపై గణాంకాల గడబిడ

- 370 సీట్లన్న బీజేపీ ప్రచారం మైండ్‌గేమన్న విశ్లేషకులు
- పదేండ్ల ఎన్డీయే పాలనపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత
- విపక్షాల ఐక్యతతో ఉమ్మడి అభ్యర్థికే గెలుపు అవకాశం
- పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న ప్రాంతీయ పార్టీల బలం
- కమలానికి 250 సీట్లు వస్తే గొప్పేనంటున్న పరిశీలకులు

హైదరాబాద్, ఏప్రిల్ 26, (నమస్తే తెలంగాణ): రెండు నెలల కిందట ఫిబ్రవరి 5న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయే కూటమికి 400 సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. గత 77 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒకే ఒక్కసారి 414 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. అదీ 1984లో ఇందిరాగాంధీ హత్య తరువాత దేశ వ్యాప్తంగా వచ్చిన సానుభూతి ఓట్లతో మాత్రమే. బీజేపీ 2014లో 428 స్థానాల్లో పోటీ చేసి 282 సీట్లు గెలుచుకున్నది. ఇక 2019లో 436 సీట్లలో పోటీ చేసి 303 సీట్లు సాధించింది. ఆ క్రమంలోనే 370 సీట్లు గెలవడం సాధ్యమని మోదీ భావించి ఉండవచ్చు. కానీ ప్రస్తుతం ఎన్నికల వేడి పుంజుకున్న నేపథ్యంలో బీజేపీ గెలుచుకోబోయే సీట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

కొత్తగా కలిసొచ్చే అంశాలు సున్నా

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్న 303 ఎంపీలలో రాజీనామాలు, ఎంపీల మరణాలు, ఉప ఎన్నికలు వంటి కారణాలతో 14 స్థానాలను బీజేపీ కోల్పోయింది. దాంతో ప్రస్తుతం అధికార పార్టీకి లోక్‌సభలో 289 సభ్యులున్నారు. పార్టీ విజయంపై మోదీ ఆత్మవిశ్వాసం నిజం కావాలంటే ప్రస్తుతమున్న ప్రతి స్థానాన్ని నిలుపుకోవడం, గత ఐదేండ్లలో కోల్పోయిన 14 సీట్లను తిరిగి గెలుచుకోవడంతోపాటు అదనంగా మరో 67 సీట్లు తెచ్చుకోవాలి. ప్రస్తుత ఎన్నికల్లో ఆ సీట్లన్నింటినీ మళ్లీ బీజేపీ పొందగలదా అంటే ప్రశ్నార్థకమే. ఈ సారి కొత్తగా బీజేపీకీ కలిసి వచ్చే అంశాలు గానీ, ప్రాంతాలు గానీ ఏమీలేవు. ఈ ఐదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేరువ కాకపోగా అధికంగా వ్యతిరేకతను మూటగట్టుకున్నది.

రెండో విడతలో అన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలే

రెండో విడత అధికారం చేపట్టిన బీజేపీ ఆ తర్వాత తీసుకున్నవన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలే. పెట్రోల్, గ్యాస్ ధరల రెట్టింపు, నిత్యావసర ధరల పెంపు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, నూతన వ్యవసాయ చట్టాలు, పెరిగిన రైతుల ఆత్మహత్యలు, తీవ్ర ద్రవ్యోల్బణం వంటి అంశాలు దేశ ప్రజలను అల్లకల్లోలం చేసి, తీవ్ర వేదనలోకి నెట్టివేశాయి. ఆ కారణంగా బీజేపీ ప్రాబల్యమున్న రాష్ట్రాల్లోనే ఆ పార్టీకి 2019 ఎన్నికలనాటి విజయం అసాధ్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో మళ్లీ 2019 ఎన్నికల్లో మాదిరి 249 సీట్లు గెలిచిందనుకున్నా కూడా 370 స్థానాలను పొందాలంటే మిగతా భారతావనిలోని 213 స్థానాల నుంచి 121 సీట్లు గెలవాలి. ఆ 213 స్థానాల్లో గతంలో 54 సీట్లు మాత్రమే గెలుచుకున్న బీజేపీకి ఇది ఎంతవరకు సాధ్యమో చూద్దాం

ప్రాంతీయ పార్టీలదే హవా

బీజేపీకి బలం లేని రాష్ట్రాల్లో విజయం సాధించే సీట్లు పెద్దగా పెరిగే అవకాశాలు లేవు. ఈ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు ప్రజల్లో మంచి బలం ఉన్నది. అలాగే స్థానిక సమస్యలపై బీజేపీకి సరైన అవగాహన లేని కారణంగా జాతీయ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై ఆయా రాష్ట్రాల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. ఉదాహరణకు జాతీయ స్థాయిలో నీట్ పరీక్ష నిర్వహణను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. పదేండ్ల బీజేపీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగిపోవడం, పెట్రో, గ్యాస్ ధరలు రెట్టింపవడం, ధనవంతులే మరింత అభివృద్ధి చెందడం వంటివి ప్రజల్లో వ్యతిరేకతను పెంచాయి. నిరుద్యోగం పెరిగిపోయి యువతలో వ్యతిరేకత పెల్లుబుకింది. రైతు వ్యతిరేక చట్టాలు, గిట్టుబాటు ధరకు హామీ లేకపోవడం వంటి సమస్యలతో రైతుల్లో ఆత్మహత్యలు పెరిగాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన మీదట బీజేపీకి గట్టి పట్టున్న రాష్ట్రాల్లోని 330 స్థానాలకు గాను 220 సీట్లు గెలుచుకుంటే గొప్పేనని, అలాగే బీజేపీకి అంతగా బలం లేని రాష్ట్రాల్లోని 213 స్థానాలకు గాను ఈ సారి 30 సీట్లు గెలుచుకోవచ్చునని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బీజేపీ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, ప్రాంతీయ పార్టీలపై ప్రజలకు పెరుగుతున్న నమ్మకం కారణంగా బీజేపీకి ఈ సారి ఎన్నికల్లో మొత్తం మీద 250 సీట్లకు మించి గెలుచుకునే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆ కారణంగానే సందిగ్ధతతో కొట్టుమిట్టాడుతున్న బీజేపీ మైండ్‌గేమ్‌కు తెరతీసిందని, అందులో భాగంగానే 370 స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ప్రచారం మొదలు పెట్టిందని పరిశీలకులు భావిస్తున్నారు. చిన్నా చితకా పార్టీలతో పొత్తులు కుదుర్చుకోవడానికి కూడా ఇదే కారణమని వారు స్పష్టం చేస్తున్నారు.

బీజేపీ, దాని మిత్రపక్షాలకు గట్టి పట్టున్న రాష్ట్రాలు, గెలిచిన సీట్లు, ఓట్ల శాతం

రాష్ట్రం	మొత్తం స్థానాలు	బీజేపీ గెలిచిన స్థానాలు	వచ్చిన ఓట్ల శాతం
యూపీ	80	62	50.0
మధ్యప్రదేశ్	29	28	58.5
గుజరాత్	26	26	63.1
కర్ణాటక	28	25	51.8
రాజస్థాన్	25	24	59.1
మహారాష్ట్ర	48	23	27.8
బీహార్	40	17	24.1
జార్ఖండ్	14	11	51.6
హర్యానా	10	10	58.2
అస్సాం	14	9	36.4
ఛత్తీస్‌గఢ్	11	9	51.4
ఉత్తరాఖండ్	5	5	61.7
మొత్తం	330	249	

బీజేపీయేతర, పలు ఇతర రాష్ట్రాలు

రాష్ట్రం	మొత్తం స్థానాలు	బీజేపీ గెలిచిన స్థానాలు	వచ్చిన ఓట్ల శాతం
వెస్ట్ బెంగాల్	42	18	40.6
ఒడిశా	21	8	38.9
ఢిల్లీ	7	7	56.9
హిమాచల్	4	4	69.7
తెలంగాణ	17	4	19.7
పంజాబ్	13	2	9.7
గోవా	2	1	51.9
ఆంధ్రప్రదేశ్	25	0	1.0
కేరళ	20	0	13.0
సిక్కిం	1	0	4.7
తమిళనాడు	39	0	3.6
ఈశాన్య రాష్ట్రాలు	10	5	
యూటీలు	12	5	
మొత్తం	213	54	



బెంగళూరులో ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకొని ఓటేసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు

రెండో దశలో 63.5% ఓటింగ్

- అత్యధికంగా త్రిపురలో 79.46 శాతం
- 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: లోక్‌సభ రెండో దశ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ముగిసింది. 13 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో దాదాపుగా 63.5శాతం ఓటింగ్ నమోదైంది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. త్రిపురలో అత్యధికంగా 79.46 శాతం పోలింగ్ జరిగింది. ఆ తర్వాత మణిపూర్‌లో 77.32 శాతం ఓటింగ్ నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లో 54.85 శాతం, బిహార్‌లో 55.08 శాతం పోలింగ్ జరిగింది. కేరళలోని మొత్తం 20 స్థానాలు, కర్ణాటకలో 14, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్రలో 8, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, అస్సాంలో 5, బీహార్‌లో 5, ఛత్తీస్‌గఢ్‌లో 3, పశ్చిమ బెంగాల్‌లో 3, మణిపూర్‌లో 1, త్రిపురలో 1, జమ్ము కశ్మీర్‌లో 1 స్థానానికి రెండో దశలో పోలింగ్ జరిగింది.

పలుచోట్ల చెదురుమదురు సంఘటనలు

ఎన్నికలు జరిగిన పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కేరళలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న ఒక పోలింగ్ ఏజెంట్, ఓటేసిన ముగ్గురు ఓటర్లు ఎండ వేడి, అనారోగ్య వల్ల మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మహసముంద్‌లో ఎన్నికల భద్రతా విధుల్లో ఉన్న ఓ జవాన్ గన్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణిపూర్‌లోని కల్లోలిత ప్రాంతాల్లో భారీ భద్రత మధ్య ఓటింగ్ జరిగింది. పలుచోట్ల మిలిటెంట్లు ఓటర్లను ఓటేయొద్దని బెదిరించారు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని ఇండిగనత గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణతో పలు ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. కాగా, బెంగళూరులోని ఓ ప్రైవేటు దవాఖానలో ఉన్న 41 మంది పేషెంట్లు ఓటు వేసేందుకు గ్రీన్ కారిడార్లు ఏర్పాటుచేసి అంబులెన్సుల్లో తీసుకెళ్లారు.

బీజేపీ నేతలపై కేసు నమోదు

మతం పేరుతో ఓట్లడుగుతూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్యపై కేసు నమోదైంది. విద్వేష వ్యాఖ్యలు చేసి, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతున్నారనే ఆరోపణలపై కర్ణాటకకు చెందిన సీనియర్ బీజేపీ నేత సీటీ రవిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐదో దశ నోటిఫికేషన్ విడుదల

లోక్‌సభ ఎన్నికల ఐదో దశ నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం జారీ చేసింది. బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్ముకశ్మీర్, లఢక్‌లో ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 49 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. అతి తక్కువ స్థానాల్లో ఓటింగ్ జరగనున్న దశ ఇదే. ఈ విడతలో మే 20న పోలింగ్ జరగనుంది.

బీజేపీకి ఓటేయకుంటే.. బుల్డోజర్లు వస్తయ్!

అస్సాంలోని ఓ గ్రామంలో ముస్లింలకు బెదిరింపులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని, లేకపోతే మీ ఇండ్లమీదకు బుల్డోజర్లను పంపిస్తామని అస్సాంలోని హైలకండీ జిల్లాలోని బుటుకుసీ గ్రామంలోని ముస్లింలను అక్కడి అధికారులు బెదిరించారు. దీంతో బాధితులు స్థానిక కోర్టును ఆశ్రయించారు. అటవీశాఖకు చెందిన తొమ్మిది మంది అధికారులు తమను హెచ్చరించినట్టు బాధితులు వాపోయారు. అటవీశాఖ ప్రధాన కార్యదర్శి, బీజేపీ సానుభూతిపరుడు ఎంకే యాదవ్ కూడా తమను బెదిరించిన వారిలో ఉన్నట్టు ఆరోపించారు. బాధితుల పిటిషన్‌ను విచారించిన కోర్టు దర్యాప్తు జరుపాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

అమెరికాలో భారత సంతతి విద్యార్థిని అరెస్ట్

న్యూయార్క్: పాలస్తీనాకు మద్దతుగా ధర్నా నిర్వహించినందుకు భారత సంతతి విద్యార్థిని అచింత్యా శివలింగన్‌ను అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం అరెస్ట్ చేసి క్యాంపస్ నుంచి బహిష్కరించింది. అచింత్యాపై క్రమశిక్షణ చర్యలు సైతం తీసుకోనున్నట్టు వర్సిటీ అధికారి ప్రతినిధి గురువారం వెల్లడించారు. సుమారు వంద మంది విద్యార్థులు వర్సిటీలో గుడారాలు వేసుకొని ఆందోళన చేశారు.

గూగుల్ యాడ్స్‌కే 101 కోట్లు!

- 2018 నుంచి బీజేపీ వ్యయం ఇది..
- రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసిన దేశంలోనే మొదటి పార్టీ బీజేపీనే
- 45 కోట్లతో రెండో స్థానంలో కాంగ్రెస్

న్యూఢిల్లీ: గూగుల్‌లో రాజకీయ ప్రకటనలు ఇచ్చే విషయంలో కేంద్రంలోని అధికార బీజేపీ ముందున్నది. గూగుల్, ఆ సంస్థ వీడియో ప్లాట్‌ఫాం యూట్యూబ్‌పై ప్రకటనలకు 100 కోట్లపైగా ఖర్చు చేసిన దేశంలోనే తొలి పార్టీగా బీజేపీ నిలిచింది. 2018, మే 31–2024, ఏప్రిల్ 25 మధ్య కాలంలో డిజిటల్ క్యాంపెయిన్ (రాజకీయ ప్రకటనలు) కోసం అధికార బీజేపీ దాదాపు రూ.101 కోట్లు ఖర్చు చేసిందని, ఇది అన్ని పార్టీల మొత్తంలో (రూ.390 కోట్లు) 26 శాతమని గూగుల్ యాడ్స్ ట్రాన్స్‌పరెన్సీ సెంటర్ డాటాను ఉటంకిస్తూ ఇండియా టుడే వెల్లడించింది. గూగుల్ యాడ్స్‌పై వ్యయంలో రూ.45 కోట్లతో ప్రతిపక్ష కాంగ్రెస్ రెండో స్థానంలో ఉండగా.. తర్వాతి స్థానంలో డీఎంకే (రూ.42 కోట్లు) ఉన్నది.

రెండో దశలో బీజేపీని మించిన కాంగ్రెస్!

లోక్‌సభ ఎన్నికల రెండో దశ ప్రచారంలో భాగంగా గూగుల్ యాడ్స్‌పై ఖర్చులో కాంగ్రెస్ పార్టీ బీజేపీని మించిపోయింది. ఈనెల 18 నుంచి 24 మధ్య రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలు, పాలసీలు, తదితర అంశాలను గూగుల్‌పై ప్రచారం చేసుకొనేందుకు గూగుల్ యాడ్స్‌పై రూ.14 కోట్లు ఖర్చు చేశాయి. ఇందులో కాంగ్రెస్ రూ.5.7 కోట్లు, తర్వాతి స్థానంలో బీజేపీ రూ.5.3 కోట్లు వ్యయం చేశాయి. కర్ణాటకలో బీజేపీ అధికంగా ఖర్చు చేయగా.. కాంగ్రెస్ ప్రధానంగా కేరళపై దృష్టి పెట్టింది.

గత ఆరేండ్లలో గూగుల్ యాడ్స్‌పై పార్టీల ఖర్చు

పార్టీ	వ్యయం (రూ.ల్లో)
బీజేపీ	101 కోట్లు
కాంగ్రెస్	45 కోట్లు
డీఎంకే	42 కోట్లు




బీజేపీ ఏ రాష్ట్రంలో ఎంత ఖర్చు?

రాష్ట్రం	ఖర్చు
కర్ణాటక	10.8 కోట్లు
ఉత్తరప్రదేశ్	10.3 కోట్లు
రాజస్థాన్	8.5 కోట్లు
ఢిల్లీ	7.6 కోట్లు

రెండో దశలో పార్టీల ఖర్చు

పార్టీ	వ్యయం(రూ.ల్లో)
కాంగ్రెస్	5.7 కోట్లు
బీజేపీ	5.3 కోట్లు
వైసీపీ	1.76 కోట్లు



100% వీవీప్యాట్ల లెక్కింపు కుదరదు

- ఎన్నికల వేళ సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఈవీఎంలపై పిటిషన్లు కొట్టివేత
- సింబల్ లోడింగ్ యూనిట్లను కనీసం 45 రోజులు భద్రపర్చాలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ 'ఈవీఎం–వీవీప్యాట్ల లెక్కింపు'నకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లలో పోలైన అన్ని ఓట్లను మొత్తం వీవీప్యాట్ల స్లిప్పులతో (100% స్లిప్పులతో) సరిపోల్చాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. బ్యాలెట్ పద్ధతిలోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పును వెలువరించింది.

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



- ఈవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ పోల్చి చూడాల్సిన పని లేదు. స్లిప్పులను తీసుకుని ఓటరు మరో బాక్స్‌లో వేయాల్సిన అవసరం కూడా లేదు.
- ప్రొటోకాల్స్, సాంకేతికంగా ఈవీఎంల పనితీరు తదితర అంశాలను క్షుణ్నంగా పరిశీలించి.. అధికారులను అడిగి అన్ని వివరాలను తెలుసుకున్నాకే ఇది చెప్తున్నాం.
- ఈవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులను వందశాతం సరిపోల్చాలని వచ్చిన పిటిషన్లు సరికాదు.

ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కీలక ఆదేశాలు

- ఈవీఎంలలో ఎన్నికల గుర్తులను లోడ్ చేశాక ఆ యూనిట్‌ను సీల్ చేయాలి. అనంతరం వీటిని కంటైనర్లలో భద్రంగా పెట్టాలి.
- ఫలితాలు వెలువడిన కనీసం 45 రోజుల వరకు ఈవీఎంలతో పాటు, వీవీప్యాట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చాలి.
- ఎన్నికల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తే, వాటిని తనిఖీ చేసుకోవచ్చు.
- ఈవీఎంలలోని మైక్రోకంట్రోలర్‌లో బర్న్ చేసిన మెమొరీని ఈవీఎం తయారీదారులైన ఇంజినీర్ల సాయంతో అభ్యర్థులు ఈ తనిఖీలు నిర్వహించుకోవచ్చు.
- కంట్రోల్ యూనిట్‌లోని 5 శాతం ఈవీఎంలను, వీవీప్యాట్లను సరిపోల్చుకొని ఈ విధంగా తనిఖీ చేయించుకోవచ్చు.
- ఇందుకుగానూ ఫలితాలు వెలువడిన ఏడు రోజుల్లోగా ఫీజు చెల్లించి ఫిర్యాదుదారులు రాతపూర్వకంగా వినతి ఇవ్వాల్సి ఉంటుంది.
- ఫిర్యాదుదారే దీనికి అయ్యే ఖర్చును భరించాలి.
- ఒకవేళ ఈవీఎంలు ట్యాంపర్ అయినట్టు ఈ తనిఖీల్లో తేలితే.. అభ్యర్థులు చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చేయాలి.

కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: మోదీ

సుప్రీంకోర్టు తీర్పుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షానికి ఇది చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై అపనమ్మకాన్ని సృష్టించినందుకు క్షమాపణ లు చెప్పాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేస్తాం

ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

గుణ, బెమెతరా: కాంగ్రెస్ పార్టీ మతాలవారీగా వ్యక్తిగత చట్టాల అమలుకు హామీ ఇస్తే.. బీజేపీ మాత్రం మోదీ గ్యారంటీగా ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)ని దేశవ్యాప్తంగా అమలు చేస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతరా, మధ్యప్రదేశ్‌లోని గుణాలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సభల్లో ఆయన ప్రసంగించారు. 'కాంగ్రెస్ మ్యానిఫెస్టో జాగ్రత్తగా చదవండి. వాళ్లు షరియా చట్టాన్ని, ట్రిపుల్ తలాక్‌ను మళ్లీ తీసుకురావాలనుకుంటున్నారు. ఈ దేశాన్ని షరియా చట్టంతో నడపాలా?' అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఉన్నంత వరకు వ్యక్తిగత చట్టాలను అమలు చేయనివ్వదన్నారు. ఇప్పటికే తాము ఉత్తరాఖండ్‌లో యూసీసీని అమలు చేశామని తెలిపారు.

నోటాకు మెజారిటీ వస్తే మళ్లీ ఎన్నిక!?

ఈసీ వివరణ కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో నోటాకు మెజారిటీ ఓట్లు వస్తే మళ్లీ కొత్తగా ఎన్నిక నిర్వహించాలన్న అంశంపై సుప్రీం కోర్టు ఈసీని వివరణ కోరింది. అభ్యర్థుల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే, మళ్లీ ఎన్నిక నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టులో సామాజిక కార్యకర్త శివ ఖేరా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఈసీకి నోటీసులు జారీ చేసింది.

జై శ్రీరామ్, క్రికెటర్ల పేర్లు రాసిన విద్యార్థుల పాస్!

లక్నో, ఏప్రిల్ 26: ఉత్తరప్రదేశ్‌లోని వీర్ బహదూర్ సింగ్ పుర్వాంచల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ల నిర్వాకం తాజాగా వెలుగులోకి వచ్చింది. డీ ఫార్మసీ పరీక్షల్లో 'జై శ్రీరామ్' అనే నినాదాలు, క్రికెటర్ల పేర్లు రాసిన పలువురు విద్యార్థులను పాస్ చేశారు. ఇద్దరు విద్యార్థుల ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ బాగోతం బయటకు వచ్చింది. తమను పాస్ చేసేందుకు విద్యార్థులు ప్రొఫెసర్లకు లంచం ఇచ్చారని ఆరోపణలు రాగా, ఇద్దరు ప్రొఫెసర్లను వీసీ డిస్మిస్ చేశారు.

2025 నుంచి ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు!

విధానాలు రూపొందించాలని సీబీఎస్‌ఈకి కేంద్రం సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: 2025–26 అకడమిక్ సంవత్సరం నుంచి ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించడంపై విధివిధానాలు రూపొందించాలని సీబీఎస్‌ఈని కేంద్ర విద్యా శాఖ కోరిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని తెలిపాయి. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే అంశంపై విద్యా శాఖ, సీబీఎస్‌ఈ వచ్చే నెలలో పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సంప్రదింపులు చేయనున్నట్టు పేర్కొన్నాయి. విద్యార్థులకు సరిపడా సమయం ఉండటంతోపాటుగా పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన కనపర్చేందుకు ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ గత ఏడాది విడుదల చేసిన కొత్త నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సూచించింది. కాగా, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలో మాట్లాడుతూ బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరుకావడం విద్యార్థులకు తప్పనిసరేం కాదని పేర్కొన్నారు. జేఈఈ మాదిరిగానే 10, 12 తరగతుల విద్యార్థులకు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వచ్చని, అది ఐచ్ఛికం అని చెప్పారు.

భారత్‌లో వాట్సాప్ నిలిపేస్తాం!

- ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ వద్దని చెప్తే తప్పదిక
- ఐటీ రూల్స్ 4(2) నిబంధన వ్యక్తిగత గోప్యతకు వ్యతిరేకం
- ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: చాట్‌లు, కాల్స్, వీడియోలు, ఫైల్స్, వంటి వాటిని గోప్యంగా ఉంచే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని వదులుకోమని ఒత్తిడి చేస్తే భారత్‌లో తమ సేవలు నిలిపివేయాల్సి వస్తుందని వాట్సాప్ స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ – 2021లోని 4(2) నిబంధనను సవాల్ చేస్తూ వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఏదైనా పోస్ట్ లేదా మెసేజ్ మొదట ఎవరి వద్ద నుంచి వచ్చింది, ఎవరు దాని సృష్టికర్త అనేది సోషల్ మీడియా సంస్థలు గుర్తించాలని(ట్రేసబులిటీ) ఈ నిబంధన చెప్తున్నది. అయితే, ఇలా చేయాలంటే కోట్లాది మెసేజ్‌లను కొన్ని ఏండ్ల తరబడి స్టోర్ చేయాల్సి ఉంటుందని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి నిబంధన లేదని వాట్సాప్ తరఫు న్యాయవాది తేజస్ కరియా ఢిల్లీ హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పైగా ఎండ్ టూ ఎండ్ ఎంక్రిప్షన్(ఎక్కడా మెసేజ్ స్టోర్ అవకుండా నేరుగా పంపించిన వారి నుంచి అందుకునే వారికి వెళ్లడం) విధానానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు.

గోప్యతకు భంగం కలిగించలేం

ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ వల్ల తమ చాట్‌లు, సమాచారం, ఫైల్స్ వంటివి గోప్యంగా ఉంటాయనే నమ్మకంతోనే భారత్‌లో కోట్లాది మంది వినియోగదారులు వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, దీనికి భంగం కలిగే పరిస్థితే వస్తే తమపై వినియోగదారుల నమ్మకం దెబ్బతింటుందని వివరించారు. 4(2) నిబంధన వల్ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని బలవంతంగా తొలగించాల్సి వస్తుందని, ఇలా చేయమని చెప్తే వాట్సాప్ భారత్‌ను వదిలి వెళ్తుందని న్యాయవాది కోర్టుకు తెలిపారు. 4(2) నిబంధన వ్యక్తుల గోప్యతకు కూడా వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. కాగా, 2021 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త ఐటీ నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది. అన్ని సోషల్ మీడియా సంస్థలు ఈ నిబంధనలు పాటించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిబంధనల్లో కొన్నింటిని సోషల్ మీడియా సంస్థలు వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఈ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది.



నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ'లో..

శనివారం SATURDAY 27.4.2024

హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 323 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

నేనొచ్చిన.. నువ్వెక్కడ?

- రాజీనామా సవాల్‌కు ఎందుకు వెనకాడుతున్నవ్?
- రావట్లేదంటే.. ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నట్టే లెక్క
- అమరుల స్తూపం వద్దకు రాలేకపోతే పీఏతో పంపు
- ఉద్యమ జర్నలిస్టుల చేతుల్లో నా రిజైన్ లెటర్ పెడుతున్న
- హామీలు అమలు చేసి, నా రాజీనామా ఆమోదించుకో
- తర్వాత వచ్చే ఉప ఎన్నికల్లో కూడా నేను పాల్గొనను › 5
- గన్‌పార్క్ వద్ద సీఎం రేవంత్‌కు హరీశ్ ఓపెన్ చాలెంజ్

- అమరులకు జోహారు



- త్యాగాలకు అవమానం



స్పందించని రేవంత్

- గన్‌పార్క్ వద్దకు రాని ముఖ్యమంత్రి
- రాజీనామాపై నోరుమెదపక మౌనం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు హామీల అమలుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తన సవాల్‌కు కట్టుబడగా.. సీఎం రేవంత్‌రెడ్డి మాటలకే పరిమితమయ్యారు. ఆగస్టు 15లోగా రూ. 2 లక్షల రుణమాఫీ సహా ఆరు గ్యారెంటీల హామీలన్నీ నెరవేర్చితే తాను రాజీనామా చేస్తానని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి కూడా లేఖతో రావాలని సవాల్ విసిరారు. చెప్పిన మాట › 8వ పేజీలో

చెప్పులేసుకొని స్పీచ్‌లు

- అమరులకు ఒక్క పువ్వుతోనూ నివాళి అర్పించని నేతలు
- బీఆర్ఎస్ పూలదండలను ఊడ్చేసిన ఇందిర › 5
- హస్తం నేతల నుంచి వినిపించని 'జై తెలంగాణ'


కేసీఆర్ తలకాయ మేం తీసేయాలా?

బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం హామీలు అమలు చేయలేదన్న కోమటిరెడ్డి › 5

మీకిస్తే.. మాకేంటి?

పెండింగ్ బిల్లుల చెల్లింపులో పర్సెంటేజీల దందా!

- బ్యాక్ డోర్‌లో పైసల పందేరం!
- 10-20 శాతం కమీషన్లంటూ చర్చ
- కాంట్రాక్టర్లలో హాట్ హాట్ టాపిక్
- కీలక నేత సన్నిహితుడి చేతివాటం
- ముడుపు ముడితే డైరెక్ట్ చానలే!
- రోజువారీ రాబడి.. చెల్లింపులకే సరి
- పెరిగిన ఆదాయం, అప్పులూ అటే
- అటకెక్కిన రైతుబంధు సాయం
- చిరుద్యోగుల జీతాలూ, ఉద్యోగుల బిల్లులూ కూడా పెండింగ్‌లోనే



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత నాలుగు నెలలుగా ప్రభుత్వ ఆదాయం పెరిగినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. మరి ఈ ఆదాయం ఎక్కడికి పోతున్నది? ఎన్నికల వ్యయానికి నిధులను సమకూర్చేందుకు 20 శాతం కమీషన్‌తో పాత బిల్లులకు క్లియరెన్స్ ఇస్తున్నట్టు అధికార, రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అప్పటివరకు వచ్చే నెలసరి ప్రభుత్వ ఆదాయం రూ.10వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్ల వరకు పెరిగిందని ఆర్థికశాఖ లెక్కలు చెప్తున్నాయి. ఇలా గత నాలుగు నెలల్లోనే రూ.50వేల కోట్లపైగా ఆదాయం సమకూరింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గత నాలుగు నెలల్లోనే ఏకంగా రూ.24వేల కోట్ల మేర అప్పులు తెచ్చింది. అంటే.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు అప్పులు కలుపుకుంటే దాదాపు రూ.75 వేల కోట్ల పద్దులు కండ్ల ముందు ఉన్నాయి. అంటే.. సర్కారు ఖజానాలో కాసులు బాగానే ఉన్నాయి. కానీ..?!

* రైతుబంధు ఎందుకు వేయడం లేదు? ములుగు జిల్లా వెంకటాపురం మండలం కేశవాపూర్ గ్రామంలో శుక్రవారం మంత్రి సీతక్కను నిలదీసిన రైతులు. ఇక్కడే కాదు.. రాష్ట్రమంతా రైతుల్లో ఇదే ఆగ్రహం.

యాసంగి రైతుబంధు కోసం గతంలోనే ఖజానాలో రూ.7వేల కోట్ల పైచిలుకు మొత్తాన్ని ఉంచామని బీఆర్ఎస్ చెప్తున్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఐదెకరాల వరకు ఉన్న రైతులకు కూడా ఇప్పటివరకు పెట్టుబడి సాయం › 8 వ పేజీలో



కొండా సురేఖకు ఈసీ వార్నింగ్

కేసీఆర్, కేటీఆర్‌పై నిందారోపణలు సరికాదని హితవు

ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా మాట్లాడొద్దని హెచ్చరిక › 4

మళ్లీ ఉరికొయ్యకు నేతన్న

సమైక్య రాష్ట్రంలో మరణ మృదంగం.. కేసీఆర్ హయాంలో 'చేనేతకు చేదోడు'



- ఐదునెలల హస్తం పాలనలో మళ్లీ చీకటి రోజులు
- దొరకని ఉపాధి.. ఆగుతున్న గుండెలు
- నాలుగు నెలల్లో ఐదుగురి బలవన్మరణం › 4
- కేటీఆర్ లేఖ రాసినా పట్టని రాష్ట్ర సర్కారు

పని దొరకక చనిపోయిండు

నా భర్త పేరు రాజు. మాకు కొడుకు, బిడ్డ ఉన్నరు. మాకు మూడు జోడీల సాంచాలుండె. అవి నడవక, పెట్టుబడి ఎల్లక అప్పుల పాలైనం. ఏడాది కింద సాంచాలు అమ్మి కట్టినం. నాభర్త రాజు ఓ సేటు దగ్గర సాంచాలు నడిపిస్తూ మమ్మల్ని సాకిండు. బిడ్డ, కొడుకును మంచిగ చదివిస్తనంటుండె. కొత్తగొచ్చిన సర్కారు ఆర్డర్లు ఇయ్యలే. పోయిన బతుకమ్మకు తయారు చేసిన చీరల పైసలు కూడా ఇయ్యలేదని సేట్లు సాంచాలు మొత్తం బంద్ పెట్టిండ్రు. ఏదైనా పని చూసుకుంటానని పదిహేను రోజుల కింద పోయిన మనిషి శవమై వచ్చిండు. పని దొరక్క, తిండిలేక నాభర్త చనిపోయిండు.

\- ఆత్మహత్య చేసుకున్న ఈగ రాజు భార్య రేఖ

పన్ను చెల్లించకుంటే.. కరెంట్ 'కట్'

పట్టణ ప్రజలకు జనగామ పురపాలక కమిషనర్ హెచ్చరిక › 4

రెండో దశలో 63.5% పోలింగ్

- త్రిపురలో అత్యధికంగా 79.46%
- మణిపూర్‌లో 77.32% నమోదు
- యూపీ, బీహార్‌లో 55 శాతమే
- 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు పోలింగ్
- 4వ విడత ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి › II



100% వీవీప్యాట్ల లెక్కింపు కుదరదు

- ఎన్నికల వేళ సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఈవీఎంలపై పిటిషన్లు కొట్టివేత
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలన్న పిటిషన్‌నూ తిరస్కరించిన ధర్మాసనం
- సింబల్ లోడింగ్ యూనిట్లను కనీసం 45 రోజులు స్ట్రాంగ్‌రూమ్‌లలో ఉంచాలి
- అభ్యర్థులు కోరుకుంటే ఈవీఎంల తనిఖీ
- ఈసీకి సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశాలు

› II



పబ్బతి పట్టిన పాలమూరు ప్రజానీకం.. మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బస్సుయాత్ర సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

చోటేభాయ్ దగా.. బడేభాయ్ పగ

అన్నమో, అటుకులో తిని రాష్ట్రం సాధించినం • తెలంగాణను నాశనం చేస్తామంటే యుద్ధమే • స్కూటీలు రాలె, కానీ లూటీలు వస్తున్నయ్

రాష్ట్రానికి ఏమీ ఇవ్వని బీజేపీకి ఓటేయొద్దు • ప్రధాని మోదీవి నినాదాలే.. అమలు లేదు • నా చివరి శ్వాస వరకు సెక్యులర్‌గానే ఉంటా

ముస్లింలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు • కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీ గెలుస్తుంది • మహబూబ్‌నగర్ రోడ్‌షోలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి చోటేభాయ్, ప్రధాని మోదీ బడేభాయ్ అని.. బడేభాయ్ తెలంగాణపై పగబడితే, చోటేభాయ్ గ్యారెంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దగా చేశారని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆరోపించారు. తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి ఓటేయొద్దని, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌ను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగిస్తూ.. 'నా ప్రాణం ఉన్నంత వరకు, నా కండ్ల ముందటనే తెలంగాణను నాశనం చేస్తమంటే, యుద్ధం చేస్త తప్ప, నిద్రపోను. ఆనాడు అంత కష్టపడి, నా ప్రాణాలకు తెగించి, సచ్చిపోయిన ఫర్వాలేదని ఆమరణ నిరాహర దీక్ష చేసి, తెలంగాణ తెచ్చా. అలాంటి తెలంగాణ నా కండ్ల ముందే నాశనం అయిపోతే, చూస్తూ ఉరుకోవాల్నా? యుద్ధం చేద్దామా? కొట్లాడుదామా? అందరు తయారుగా ఉండాలె' అని పిలుపునిచ్చారు.



శుక్రవారం రాత్రి బస్సుయాత్రలో భాగంగా మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పథకాలేవి?

'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలైంది. ఆ పార్టీకి ఓటు వేస్తే రైతుబంధు అందరికీ వచ్చిందా? కేసీఆర్ 10 వేలు ఇస్తాండు, నేను 15 వేలు ఇస్తా అని చెప్పారు. మరి వచ్చినయా? కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తాండు, మేము వస్తే తులం బంగారం కూడా ఇస్తామని చెప్పారు. మహిళలకు రూ.2,500 వచ్చాయా? ఆసరా పింఛన్ 4 వేలు అయిందా? రెండు లక్షల రుణమాఫీ అయ్యిందా? గోవిందానేనా? గ్యారెంటీగా గోవిందానేనా?' అని సభికులను కేసీఆర్ ప్రశ్నించగా.. గోవిందానే అని సమాధానం ఇచ్చారు. వడ్లకు 500 బోనస్ ఇస్తున్నారా? ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారా? అని అడిగారు. దానికి రాలేదన్న జవాబే వినిపించింది. స్కూటీలు రాలే, కానీ లూటీలు వస్తున్నాయని కేసీఆర్ ఆరోపించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో నలుగురు విద్యార్థులు చనిపోయారని, విషాహారం పెడుతున్నారని, దానిని చూసే దిక్కులేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వటం లేదని, ఐదు నెలల నుంచి రూపాయి లేదని, అవి ఎలా నడవాలని ప్రశ్నించారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.20 లక్షలు ఇచ్చామని, దాన్నీ బంద్ పెట్టారని, ప్రతి విషయంలో మోసం, ప్రతి స్కీంలోనూ దగా, అన్ని రకాలుగా మనల్ని నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చేనేత కార్మికులకు రూపాయి కూడా ఇస్తలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

> తెలంగాణలో 33 జిల్లాలు చేసుకున్నం. ఒక్క నవోదయ పాఠశాలైనా మోదీ ఇచ్చారా? కొత్తగా తెచ్చుకున్న పేద రాష్ట్రానికి, ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వని బీజేపీకి మనం ఒక్క ఓటు కూడా ఎందుకు వేయాలి. మోదీ దేశంలో కొత్తగా 157 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. తెలంగాణకు నాలుగు కాలేజీలు ఇవ్వాలని బతిమిలాడినా ఒక్క కాలేజీ ఇవ్వలేదు.
> - కేసీఆర్

పథకాలు అమలవుతున్నాయా?

బీజేపీ, కాంగ్రెస్ పథకాలు వచ్చినయా? అమలవుతున్నాయా? అని అడిగి సభికుల నుంచి కేసీఆర్ సమాధానాన్ని రాబట్టారు. కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సభకు హాజరైన ప్రజలు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. బీజేపీ ఈ దేశాన్ని పదేండ్ల నుంచి పాలిస్తున్నదని, బీజేపీ గురించి ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. ఆ పార్టీకి ఎందుకు ఓటు వేయాలనేది ప్రజలు ఆలోచన చేయాలని, మన కండ్లను మనమే పొడుచుకుందామా? విషం ఇస్తే తాగుదామా? అని అడిగారు. 'మహబూబ్‌నగర్‌లో పోటీచేస్తున్న అభ్యర్థి ఎవరు? ఆమె గుణగణాలు ఏంది? బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమిటి? నరేంద్రమోదీ ఎన్ని నినాదాలు చెప్పారు? కనీసం 100 నినాదాలు చెప్పాడు. ఒక్క నినాదమన్న నిజమైందా? కట్టుకథలు, పిట్ట కథలు చెప్పారు. మోదీ పాలనలో ఎవరికైనా లాభం జరిగిందా? భేటీపడావో, భేటీబచావో పథకం అమలైందా? మేకిన్ ఇండియా బక్వాస్, సబ్ కా సాత్, సబ్ కా వికాస్, దేశ్ కా సత్యనాశ్, డిజిటల్ ఇండియా జరిగిందా? అచ్చేదిన్ వచ్చిందా? సచ్చేదిన్ వచ్చిందా? అమృత్‌కాల్ లేదు, మన్నూ లేదు. దేశమంతా నాశనం అయ్యింది. ఆత్మనిర్భర్ భారత్ అయ్యిందా? జన్ ధన్ యోజనతో ఏమన్న లాభం జరిగిందా? ఫసల్‌బీమా ఏ రైతుకైనా వచ్చిందా? ఎవరికైనా 15 లక్షలు వచ్చాయా? ఇవన్నీ చేసినందుకు నరేంద్రమోదీ విశ్వగురువా?' అని ప్రశ్నిస్తూ కేంద్రంలోని బీజేపీపై మండిపడ్డారు. డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు కానీ, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తేలేకపోయారని దుయ్యబట్టారు. ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు.

> డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు కానీ, పాలమూరు ప్రాజెక్టుకు మాత్రం జాతీయ హోదా తేలేకపోయారు. మనం ఉద్యమం చేస్తుంటే, ఆంధ్ర వాళ్లు మన నీళ్లు ఎత్తుకుపోతుంటే, డీకే అరుణ వెళ్లి వాళ్లకు మంగళ హారతులు పట్టారు. బీజేపీ మనకు అక్కరకురాని చుట్టం.
> - కేసీఆర్

> రైతుబంధు కూడా ఉంచుతరో, ఊడగొడుతరో. రైతుబీమా కూడా ఉంటదో, ఉండదో తెల్వదు. రాబోయే రోజులలో మన రైతాంగం, మన యువత అందరం ఏకమై కులాలు, మతాలకు అతీతంగా ఈ ప్రభుత్వం మెడలు వంచాలె.
> - కేసీఆర్

కేంద్రంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీ

ప్రపంచంలో డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ 83 రూపాయలకు పడిపోయిందని, ఇది దేశానికి గౌరవమా? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఇది నరేంద్రమోదీ పరిపాలన ఫలితామా? అని అడిగారు. కేంద్రంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని నింపటం లేదని, మరి నిరుద్యోగం ఎలా పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల చట్టాలు తెచ్చి ఢిల్లీ దగ్గర రైతులు ధర్నా చేస్తే దాదాపుగా 750 మంది రైతులు చనిపోయారని, పోలీసు కంచెలు పెట్టి కొట్టారు తప్ప వారిని దగ్గరికి రానివ్వలేదని గుర్తుచేశారు. చనిపోయిన 750 మంది రైతుల కుటుంబాలకు తాను చెక్కులు ఇచ్చానని వెల్లడించారు. చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలో ఎన్ని జిల్లాలు ఉంటే అన్ని నవోదయ విద్యాలయాలు ఇవ్వాలని, తెలంగాణలో 33 జిల్లాలు చేసుకున్నామని, ఒక్క నవోదయ పాఠశాలైనా మోదీ ఇచ్చారా? అని నిలదీశారు. కొత్తగా తెచ్చుకున్న పేద రాష్ట్రానికి, ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వని బీజేపీకి మనం ఒక్క ఓటు కూడా ఎందుకు వేయాలని ప్రశ్నించారు. మోదీ దేశంలో కొత్తగా 157 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని, తెలంగాణకు నాలుగు కాలేజీలు ఇవ్వాలని బతిమిలాడినా ఒక్క కాలేజీ ఇవ్వలేదని తెలిపారు. 'యువకులకు ఒకటే చెప్తున్నా. భవిష్యత్తు మీది. తెలంగాణ మీది. ఈ దేశం మీది. ఎవరు పనిచేస్తరో, ఎవరు న్యాయంగా ఉంటరో వాళ్లకు ఓటేస్తేనే మన బతుకులు బాగుపడతాయి. పనిచేయని వారికి ఓటు వేస్తే ఇబ్బంది పెడుతారు' అని సూచించారు.

పద్యం చదివిన కేసీఆర్

రోడ్‌షోలో మాట్లాడుతూ బీజేపీ స్వభావాన్ని కేసీఆర్ పద్యం ద్వారా వివరించారు. సుమతి శతకంలోని ఒక పద్యాన్ని చదివి వినిపించారు. 'అక్కరకు రాని చుట్టం, మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమునదా, నెక్కిన బారని గుర్రం, గ్రక్కున విడువంగ వలయు గదరా' అని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది మూడో స్థానమే

పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉన్నదని, మహబూబ్‌నగర్‌లో కూడా బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే పోటీ అని కేసీఆర్ చెప్పారు. తెలంగాణలోని ముస్లింలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటేస్తే బీజేపీ గెలుస్తుందని, ఇది మంచిది కాదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సెక్యులర్ ప్రభుత్వాన్ని నడిపామని, ప్రాణం పోయినా ఫర్వాలేదు.. చివరి శ్వాస వరకు సెక్యులర్‌గానే ఉంటానని స్పష్టం చేశారు. ముస్లిం పిల్లల కోసం రెసిడెన్షియల్ స్కూళ్లు తెరిపించామని చెప్పారు. ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం అని, గతంలో ప్రతి రంజాన్‌కు పేద ముస్లింలకు తోఫా అందించామని గుర్తుచేశారు. 'ఈసారి వచ్చిందా?' అని ప్రశ్నించగా 'రాలేదు' అని సమాధానం వచ్చింది. దేశంలోనే మొదటిసారి తాము మౌజంలు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు అందించామని వివరించారు. ఉద్యమం సమయంలో 'అల్లాకే ఘర్ మే దేర్ హై.. మగర్ అంధేర్ నహీ హై' అని తాను చెప్పేవాడినని, అల్లా దయతో రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు.

ఇద్దరూ కలిసి మీటర్లు పెడుతరు

వ్యవసాయ బావుల వద్ద మోటర్లకు మీటర్లు పెట్టాలని మోదీ చెప్పారని, మీటర్లు పెట్టకపోతే ఏటా రూ.5 వేల కోట్ల గ్రాంట్ బంద్ చేస్తానన్నారని కేసీఆర్ గుర్తుచేశారు. తన ప్రాణం పోయినా, తలకాయ తెగినా, తాను మీటర్లు పెట్టబోనని తేల్చి చెప్పానని వెల్లడించారు. 'మీటర్లు పెట్టాల్నా? వద్దా? మోదీకి ఓటేస్తే మేము మీటర్ పెట్టుమని చెప్పినంక కూడా రైతులు మాకే ఓటు వేశారని, కచ్చితంగా మీటర్లు పెడుతానని మోదీ అంటడు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి చోటేభాయ్, మోదీ బడేభాయ్. చోటేభాయ్‌కు ఓటేసినా, బడేభాయ్‌కు ఓటేసినా మీటర్లు పెడుతారు. మీటర్లు పెట్టుకోవాల్నా అనేది ప్రజలే ఆలోచన చేయాలె' అని అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ ఏడు మండలాలను, 400 మెగావాట్ల సీలేరు పవర్ ప్లాంటును ఏపీకి ఇచ్చేశారని, ఇటువంటి మోదీకి మనం ఎందుకు ఓటు వేయాలి? అని ప్రశ్నించారు. మనం ఉద్యమం చేస్తుంటే, ఆంధ్ర వాళ్లు మన నీళ్లు ఎత్తుకుపోతుంటే, డీకే అరుణ వెళ్లి మంగళహారతులు పట్టారని మండిపడ్డారు. బీజేపీ అక్కరకు రాని చుట్టమని ఎద్దేవా చేశారు.



నేనున్నా.. మీకోసం.. ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

రైతుబంధు.. బందేనా?

> 'ఒక పార్టీయేమో దేవుడి పేరు చెప్పుకొని ఓట్లడుగుతున్నది. ఇంకోపార్టీ దేవుడి మీద ఒట్టు పెట్టి ఓట్లు అడుగుతున్నది. సీఎం పోయి యాదగిరి నర్సన్న మీద ఒట్టు, జోగులాంబ అమ్మవారి మీద ఒట్టు, బాసర సరస్వతమ్మ మీద ఒట్టు అంటున్నడు. ఈ ఒట్ల రాజకీయాలు ఎవరైనా నమ్ముతారా? దమ్ముంటే అప్పుడే చేయాలి కదా?' అని కేసీఆర్ విమర్శించారు.

'మహబూబ్‌నగర్ జిల్లా రైతులైతే 25 నుంచి 30 ఎకరాలున్నా హైదరాబాద్‌కు వచ్చి ఆటో నడిపిచ్చిండ్రు. గౌడగౌడ ఏడ్చిండ్రు, ఉద్యమం జరిగేటప్పుడు నా దగ్గరకు వచ్చిండ్రు. అట్లాంటి వాళ్లను ఆదుకోవాలనే రైతుబంధు పెట్టినం. ఇయ్యాల మూడెకరాలకే వేస్తం. ఐదెకరాలకే వేస్తం. ఐదుకరాలు దాటితే ఇయ్యం అంటే నీ అయ్య జాగీరా? రైతులు తెలంగాణ బిడ్డలు కారా? నువ్వు ఐదెకరాలోనికి బంద్ పెడుతావు. ఆరో ఎకరమోడు ఎక్కడికి పోవాలె? ఏడో ఎకరమోడు ఎక్కడికి పోవాలె? వాడెమ్మన్న కోటీశ్వరుడా? అయితే 25 ఎకరాలు దాటిన తర్వాత బంద్ పెడుతామంటే ఒక లెక్క. కాని ఐదెకరాలకే బంద్ పెడతానంటే ఎట్ల? రైతుబంధు కూడా ఉంచుతరో, ఊడగొడుతరో. రైతుబీమా కూడా ఉంటదో, ఉండదో తెల్వదు. రాబోయే రోజులలో మన రైతాంగం, మన యువత అందరం ఏకమై కులాలు, మతాలకు అతీతంగా ఈ ప్రభుత్వం మెడలు వంచాలె' అని పిలుపునిచ్చారు. మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్‌కు బలం కావాలని, ప్రజలే ఆ బలమని, ఇక్కడ శ్రీనివాస్‌రెడ్డి గెలిస్తే మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ బలపడుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలే శక్తి అని, అది ప్రజలకే ఉపయోగపడుతుందని వెల్లడించారు.

> ఇప్పుడున్న ముఖ్యమంత్రి చోటేభాయ్, మోదీ బడేభాయ్. చోటేభాయ్‌కు ఓటేసినా, బడేభాయ్‌కు ఓటేసినా మీటర్లు పెడుతారు. మీటర్లు పెట్టుకోవాల్నా అనేది ప్రజలే ఆలోచన చేయాలె
> - కేసీఆర్



ఆత్మీయ స్వాగతం.. కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న పాలమూరు ప్రజలు

తెలంగాణకు కోసం పోరాడిన నన్ను పట్టుకొని అన్ని మాటలా?

'ఏమయ్యా సీఎం నువ్వు పథకాలు అమలు చేస్తలేవ్ అంటే, కేసీఆర్.. నీ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా? నీ పేగులు పీకి మెడలో వేసుకుంటా, నీ ముడ్డి మీద ఉన్న చడ్డీ గుంజుకుంటా, నిన్ను కొంచబోయి చర్లపల్లి జైల్లో వేస్తా' అని రేవంత్ అంటున్నారని, ఇది మర్యాదనా? అని కేసీఆర్ ప్రశ్నించారు. '15 ఏండ్లు అన్నం తిన్నమో, అటుకులు బుక్కినమో, అందరం కలిసి కొట్లాడి, తెలంగాణ తెచ్చుకున్నం. దానికి నాయకత్వం వహించింది నేను. తెలంగాణ కోసం నేను చచ్చిపోయేదాకా, నా ప్రాణాలు పోయే దాకా తెగబడి పోరాడిన. నన్ను పట్టుకొని ఇన్ని మాటలు మాట్లాడటమా?' అని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల పాలన ఎట్లా ఉండె? కరెంటు ఎప్పుడన్నా పోయిందా? ఇయ్యాల వస్తున్నదా? ఏం దుర్మార్గమిది చాతనైతలేదా? అని విరుచుకుపడ్డారు. 'బీజేపోడు వచ్చి కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ బీ టీం అంటడు, కాంగ్రెసోడు వచ్చి బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీం అంటడు. కానీ భువనగిరిలో ఏం జరిగింది? ఆ మున్సిపాలిటీలో బీజేపీ, కాంగ్రెస్ ఇద్దరు కలిసి బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ చైర్మన్‌ను తీసేసి, మున్సిపల్ చైర్మన్ సీటును కాంగ్రెస్, వైస్ చైర్మన్ సీటును బీజేపీ పంచుకున్నాయి' తెలిపారు.

పరవశించిన పాలమూరు

రహదారి పొడవునా జన నీరాజనం ● హారతులు పట్టి పూలు చల్లిన ప్రజలు

కేసీఆర్ రాకతో ఉప్పొంగిన ఉత్సాహం ● ఇంకా సీఎంగా ఉన్నట్టుగానే ఆదరణ

కేసీఆర్ ప్రసంగానికి జనం కేరింతలు ● సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు



మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బస్సుయాత్ర సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/జడ్చర్ల: పాలమూరులో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఎక్కడ చూసినా బీఆర్‌ఎస్ దళపతిపై అభిమానం వెల్లువెత్తింది. అడుగడుగునా ఘన స్వాగతం.. జై తెలంగాణ నినాదాలతో పట్టణం హోరెత్తింది. గడియారం చౌరస్తాలో కార్నర్ మీటింగ్ జనహోరును తలపించింది. శాసనసభ ఎన్నికల తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన కేసీఆర్‌ను చూడటానికి అభాలగోపాలం తండోపతండాలుగా తరలివచ్చింది. జడ్చర్ల, పాలమూరు రహదారులు గులాబీ పూతోటలను తలపించాయి. రైతులు, మహిళలు, వృద్ధులు దారిపొడవునా కేసీఆర్‌ను చూడటానికి బారులు తీరారు. జడ్చర్ల నుంచి ప్రారంభమైన రోడ్ షో మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రవేశించిన దగ్గర నుంచి ఎన్నికల ప్రచార సభ జరిగిన క్లాక్‌టవర్ వరకు రోడ్‌కు ఇరువైపులా కిక్కిరిసిన జనంతో పాలమూరు జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా జననేత కేసీఆర్‌పై పూలవర్షం కురిపించారు.-సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. డోలు, డప్పు వాయిద్యాల మధ్య కళాకారులు స్వాగతం పలికారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారదతోపాటు బీఆర్‌ఎస్ మహిళా నేతలు కేసీఆర్‌కు హారతులు పట్టారు. తెలంగాణ సంప్రదాయక డప్పులు, డిల్లెం-పల్లెం వాయిద్యాలు ఒకవైపు, కేసీఆర్ జిందాబాద్ నినాదాలతో ప్రతిధ్వనించాయి. బస్సులో నుంచి కేసీఆర్ చేయి ఊపుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగిపోవడంతో జనం ఆనందంతో పరవశించిపోయారు. కేసీఆర్‌ను చూడగానే జన హృదయాలు ఉత్సాహంతో నిండిపోయాయి. రైతులు పట్టరాని ఆనందంతో తమ మెడలో ఉన్న గులాబీ కండువాలు, పార్టీ జెండాలు ఊపుతూ డ్యాన్సులు చేశారు. సభ జరిగిన క్లాక్ టవర్ చౌరస్తా కూడలిలో ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. చుట్టూరా ఉన్న షాపులపై కూడా కిక్కిరిసిన జనంతో నిండిపోయింది. తాను సీఎంగా ఉన్నప్పుడు అమలుచేసిన రైతుబంధు ఉంటదో.. ఊడుతదో అని కేసీఆర్ వేదికపై అన్నప్పుడు ప్రజల నుంచి వచ్చిన స్పందన వర్ణణాతీతం. తాను ఉన్నపుడు ప్రభుత్వం ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లుండే అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు జనంలో నుంచి వ్యక్తమైన ఆర్థనాదాలు చూస్తే కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకతకు అద్దం పట్టింది. ఒక్క ముసలమ్మ అయితే బిడ్డా 'నువ్వు ఉన్నప్పుడు ఒకరికి తెలియకుండా ఒకరికి పైసలు ఇచ్చేటోడివి.. ఇప్పుడెవ్వరు ఇస్తారు' అని కన్నీళ్ల పర్యాంతం అయింది. కేసీఆర్ పాలమూరుకు వస్తుండని తెలిసి చూద్దామని వచ్చాను బిడ్డా అని చెప్పింది.

కేసీఆర్‌కు పబ్బతిపట్టిన పాలమూరు

కృష్ణమ్మను పారించిన యోధుడికి అపూర్వస్వాగతం

బస్సుయాత్ర దారిపొడవునా జయజయ ధ్వానాలు

మంగళహారతులు.. ఒగ్గుడోళ్ల చప్పళ్లతో చిందులు

ఈలలు, నినాదాలతో హోరెత్తించిన యువకులు

కేసీఆర్ బస్సు యాత్ర

మూడోరోజు డైరీ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల ఆర్తిని తీర్చి, వలసవెతలను తీర్చి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సాకారం చేసిన బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలమూరు నీరాజనం పలికింది. కండ్లారా చూసుకొని మురిసిపోయింది. కైమోడ్పులు చెప్పింది. కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజానీకం కదిలివచ్చింది. రైతులు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు చిన్నా పెద్ద అనే తేడా లేకుండా యావత్ మహబూబ్‌నగర్ పబ్బతి పట్టి జేజేలు కొట్టింది. మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ వద్ద కేసీఆర్ చేసిన ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నది. బీజేపీ, కాంగ్రెస్ దగాను కేసీఆర్ ఎండగట్టిన తీరుకు ఈలలతో హోరెత్తించింది. బీఆర్ఆర్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర మూడోరోజైన శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌ను నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ వద్ద దిగి పాలమాకుల మీదుగా జడ్చర్ల నియోజకవర్గంలోని మాచర్లకు 5.45 చేరుకున్నది. అక్కడ ఫుడ్‌కోర్టులో తేనేరు తీసుకున్న తర్వాత 6.30 గంటలకు బస్సుయాత్ర మళ్లీ ప్రారంభమైంది. జడ్చర్ల, కొత్తూరు మీదుగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మట్టిగడ్డ ప్రాంతానికి చేరుకున్నది. న్యూటౌన్, బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్‌కు చేరుకున్నారు. దారిపొడవునా గులాబీ దళపతికి పాలమూరు ప్రజానీకం పబ్బతి పట్టింది. కేసీఆర్ రాక తెలుసుకొని ఆయా రూట్లలోని సమీప గ్రామాల నుంచి ప్రజలు, కర్షకులు, మహిళలు భారీగా రోడ్లపైకి తరలివచ్చి జయ జయధ్వానాలు పలికారు. దారివెంట ఆటోలు, బస్సుల్లోని ప్రజలు సైతం బస్సు యాత్రలో కేసీఆర్‌ను చూసేందుకు ఎగబడ్డారు. రోడ్డువెంట ఉన్న రైతులు, దుకాణాదారులు కేసీఆర్‌కు కైమోడ్పులు చెప్పారు. బస్సుయాత్రలో కేసీఆర్ చూసి ఉద్యమనేతను కలగన్నారు. బస్సు యాత్రలో సెల్ఫీల కోసం ప్రజలు పోటీపడ్డారు. ముఖ్యంగా పట్టణవాసులు, యువతీ యువకులు బస్సుయాత్రను తమ మొబైల్ ఫోన్లలో బంధించుకున్నారు. బస్సులోని కేసీఆర్‌ను ఫొటోలు తీసుకుని మురసిపోయారు. బస్సుయాత్ర కాన్వాయ్ పక్కన నిల్చుని ఫొటోలు దిగారు. బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురానికి అంతులేకుండాపోయింది. అధినేతనే స్వయంగా తరలిరావడం ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. బస్సు యాత్ర దారిపొడవునా 'జై కేసీఆర్.. జై బీఆర్‌ఎస్'' నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నమ్మి మోసపోయిన రైతాంగం కేసీఆర్‌ను చూడగానే గత పదేండ్ల పాలనను తలచుకున్నారు. 'తినే కూట్లే మన్నుపోసుకున్నం'' అని రైతులు చర్చించుకోవడం విశేషం.



కాంగ్రెస్‌ను ఓడగొడుతాం

గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్‌రాథోడ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 26 : గిరిజనులను మోసగించిన కాంగ్రెస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓడగొట్టితీరుతామని గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్ రాథోడ్ స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ ఓట్లతో గెలిచి తమ వర్గాన్నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కన పెట్టారని, పైగా తెగల మధ్య చిచ్చుపెట్టే మ్యానిఫెస్టోను రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 40లక్షలకు పైగా ఉన్న గిరిజనులకు మంత్రి , ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకా రం ఒక కుటుంబానికి రెండు అవకాశా లు ఇవ్వవద్దని, కానీ ఎమ్మెల్యే వివేక్ ఇంట్లో ముగ్గురికి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. తమకు అన్యా యం చేసిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలోని గిరిజనులందరూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఓటు వేయకుండా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎస్పీ నాయక్, బాలునాయ క్, అఖిల్‌రాథోడ్, లచ్చునాయక్, రవినాయక్, ప్రభాస్‌నాయక్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

'రిజర్వ్' స్థానాలు మొగ్గేదెటు?

కాంగ్రెస్‌పై కోయల అసంతృప్తి.. మాదిగలు గరంగరం

బీఆర్‌ఎస్ ప్రొడక్ట్స్‌కే టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీ



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐదు రిజర్వ్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆసక్తికర పోరు నెలకొన్నది. గతంలో ఏ ఎన్నికల సందర్భంలోనూ లేని ప్రత్యేక వాతావరణం ఈసారి నెలకొన్నది. వీటిలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎస్టీ నియోజకవర్గాలు. ఈ రెండు స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకే ఫార్ములాను అనుకరించడం ఆసక్తికరంగా మారింది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో ఆదివాసీ, ఆదివాసీయేతరుల మధ్య దూరాన్ని పెంచి వారిని శత్రువర్గంగా మార్చిందనే విమర్శలను బీజేపీ మూటగట్టుకున్నది. ఆదిలాబాద్‌లో రాజుకున్న అగ్గి రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ, ఆదివాసీయేతర గిరిజనుల మధ్య సఖ్యతను ప్రశ్నార్థకం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఆదిలాబాద్ టికెట్‌ను కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు గోండు తెగకు కేటాయించాయి. మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని లంబాడీ/బంజారా తెగకు కేటాయించాయి. మహబూబాబాద్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో తమకు సరైన ప్రాధాన్యం కల్పించలేదని కోయ గిరిజన తెగ అలకబూనింది. దీంతో ఆ వర్గం ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్‌పై మాదిగల ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీపై మాదిగ సామాజికవర్గం ఆగ్రహంగా ఉన్నది. రాష్ట్రంలోని మూడు రిజర్వ్ నియోజకవర్గాల్లో కనీసం ఏ ఒక్కచోట కూడా తమకు అవకాశం ఇవ్వకుండా, మాల సామాజికవర్గానికే ప్రాధాన్యం ఇచ్చిందని మాదిగ సామాజికవర్గం కాంగ్రెస్ పార్టీపై భగ్గుమంటున్నది. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ సహా అన్ని మాదిగ సామాజిక సంస్థలు, సంఘాలు కాంగ్రెస్‌పై విమర్శలు సంధిస్తున్నాయి. మాజీ మంత్రులు సర్వే సత్యనారాయణ, మోత్కుపల్లి నర్సింహులు లాంటి నేతలు కాంగ్రెస్‌పై ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డిపై ఒంటికాలిపై లేస్తున్నారు. రాష్ట్రంలోని మాదిగ సామాజికవర్గ జనాభాకు అనుగుణంగా టికెట్ల కేటాయించలేదని, కనీసం ఒక్క స్థానంలోనైనా పోటీచేయడానికి మాదిగలకు అర్హత లేదా? అని ఆ వర్గం ప్రశ్నిస్తున్నది. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అసలు మాదిగే కాదని, మాదిగ ఉపకులమని ఒకవర్గం, అసలు ఆమె ఎస్సీయేకాదని మరోవర్గం విమర్శలు గుప్పిస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో రాజకీయం రసవత్తరంగా మారింది.

మంత్రి సీతక్క ప్రాధాన్యం తగ్గిందా?

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లందు, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో నర్సంపేట మినహా మిగిలిన ఆరు ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాలే. వీటిలో మహబూబాబాద్, డోర్నకల్ స్థానాల్లో లంబాడా/బంజారా ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పినపాక (పాయం వెంకటేశ్వర్లు), ఇల్లందు (కోరం కనకయ్య), భద్రాచలం (తెల్లం వెంకట్రావ్), ములుగు (మంత్రి సీతక్క)తోపాటు నర్సంపేట నియోజకవర్గాల్లో తమ సామాజికవర్గ జనాభా ఎక్కువ అని, పార్లమెంట్ స్థానం తమకే కేటాయించాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చినప్పటికీ, తమను ఆ పార్టీ విస్మరించిందని కోయ గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికకు ముందు తప్పకుండా 'ఈసారి మనకే అవకాశం వస్తుంది' అని మంత్రి సీతక్క తమ వర్గీయులతో పేర్కొన్నట్టు తెలిసింది. ప్రభుత్వంలో సీతక్క ప్రభావాన్ని తగ్గించేందుకే కోయలకు టికెట్ కేటాయించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుత అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గతంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణపై చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి నష్టం కలిగిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో అందరూ బీఆర్‌ఎస్సే ప్రొడక్ట్సే

వరంగల్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి పోటీచేస్తున్న ముగ్గురు అభ్యర్థులు కూడా గతంలో బీఆర్‌ఎస్‌కు చెందిన వారేకావడం గమనార్హం. వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్ తెలంగాణ ఉద్యమం ఆవిర్భావం నుంచి కేసీఆర్ అడుగుజాడల్లో నడిచిన కార్యకర్త. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య రాజకీయ జీవితాన్ని బీఆర్‌ఎస్ నుంచే ప్రారంభించారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ పూర్వాశ్రమంలో ఒకసారి పీఆర్పీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. బీఆర్‌ఎస్‌లో చేరిన తరువాత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి పోటీచేస్తున్న ఇద్దరు అభ్యర్థులు బీఆర్‌ఎస్ నీడలో ఎదిగినవారే. మొత్తంగా ఐదు రిజర్వ్ స్థానాల్లో మూడు పార్టీల నుంచి పోటీ చేస్తున్న 15 మందిలో 10 మంది బీఆర్‌ఎస్‌కు చెందినవారే కావడం మరో విశేషం.

రిజర్వ్ స్థానాల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి పోటీ పడుతున్న అభ్యర్థులు

పార్లమెంట్ స్థానం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
ఆదిలాబాద్ (ఎస్టీ)	ఆత్రం సుగుణ	ఆత్రం సక్కు	గోడం నగేశ్
మహబూబాబాద్ (ఎస్టీ)	పోరిక బలరాంనాయక్	మాలోత్ కవిత	అజ్మీరా సీతారాంనాయక్
పెద్దపల్లి (ఎస్సీ)	గడ్డం వంశీకృష్ణ	కొప్పుల ఈశ్వర్	గోమాస శ్రీనివాస్
నాగర్‌కర్నూల్ (ఎస్సీ)	మల్లు రవి	ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్	పోతుగంటి భరత్‌ప్రసాద్
వరంగల్ (ఎస్సీ)	కడియం కావ్య	మారపల్లి సుధీర్‌కుమార్	ఆరూరి రమేశ్

మళ్లీ ఉరికొయ్యకు నేతన్న!

- ఐదునెలల హస్తం పాలనలో మళ్లీ చీకటి రోజులు
- దొరకని ఉపాధి.. ఆగుతున్న గుండెలు
- 4 నెలల్లో ఐదుగురి బలవన్మరణం
- కేటీఆర్ లేఖ రాసినా పట్టని సర్కారు



ఆత్మహత్య చేసుకున్న అడిశర్ల సాయి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్ (ఫైల్)

కరీంనగర్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి/ రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ): సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతున్నది. ఐదునెలల హస్తం పాలనలో, జీవనాధారం కరువై నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో మాదిరిగానే ఆకలిచావులు ఆరంభమయ్యాయి. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసే అద్భుత ప్రతిభ గల మన నేతన్నలపై ఆనాటి సమైక్య రాష్ట్రం ఆదరణ చూపకపోవడంతో.. సిరిసిల్ల మరణ మృదంగమైన విషయం తెలిసిందే. స్వరాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నేతన్నల కష్టాలు, కన్నీళ్లను తొలగించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు మళ్లీ చీకట్లు అలుముకుంటున్నాయి. చేతినిండా పని కల్పించకపోగా, ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో బతుకులు భారంగా మారి నూలు పోగునే ఉరితాడుగా మార్చుకొని ప్రాణాలు తీసుకుంటున్నారు. రెండు రోజుల్లో ముగ్గురు కార్మికులు చనిపోవడం కాంగ్రెస్ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

సమైక్య రాష్ట్రంలో మరణ మృదంగం

2004 నుంచి 2014 మధ్య ఆనాటి కాంగ్రెస్ పాలనలో నేతన్నల మరణాలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పాలకుల నిర్లక్ష్యమే వందలాది మంది కార్మికుల ఊపిరి ఆగేందుకు కారణమైంది. చనిపోయినప్పుడు సానుభూతి చూపడం, ఎన్నికలు రాగానే వరాలు కురిపించి ఓట్లు దండుకోవడం ఆ తదుపరి మాట మరిచి పట్టించుకోకపోవడం ఆనాటి సీమాంధ్ర సర్కారు పాలకుల నైజంగా మారింది. రెండో షోలాపూర్‌గా ప్రసిద్ధి చెందిన సిరిసిల్ల పరిశ్రమపై అడుగడుగునా నిర్లక్ష్యం చూపింది. ఫలితంగా నాటి కాంగ్రెస్ పాలనలో 402 మంది నేతన్నలు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2007-08లో సిరిసిల్లలో వరుస ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దీంతో వైఎస్ 2008 అక్టోబర్ 12న సిరిసిల్లలో బహిరంగ సభ పెట్టారు. సిరిసిల్లను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా చేస్తామని, వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, అప్పారెల్ పార్కు ఏర్పాటు చేస్తామని, తదితర హామీల వర్షం కురిపించారు. కానీ 2009 ఎన్నికల్లో గెలిచిన తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

స్వరాష్ట్రంలో ఊపిరి

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సిరిసిల్ల నేతన్నల్లో కేసీఆర్ సర్కారు ఊపిరి నిలిపింది. సమైక్య రాష్ట్రంలో అలుముకున్న చీకట్లను తొలగిస్తూ.. నేతన్నలకు అండగా నిలిచింది. పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నది. స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి ఒక రోజంతా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. నేతన్నల వేతనాలు, కూలి రెట్టింపయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు సంపాదించుకునేలా పటిష్టమైన కార్యాచరణను రూపొందించి అమలు చేశారు. అలాగే, అనేక వినూత్నమైన సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చారు. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత కార్యక్రమాలను ప్రారంభించారు. వీటిని అమలు చేయడానికి బడ్జెట్‌ను కేటాయించారు. ప్రభుత్వం రాజీవ్ విద్యా మిషన్, సర్వశిక్ష అభియాన్ కింద దుస్తులకు సంబంధించిన ఆర్డర్లను నేతన్నలకు ఇచ్చింది. కులవృత్తిని ప్రోత్సహిస్తూనే.. పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మగ్గాల ఆధునికీకరణ, రుణాల మాఫీ, మార్కెట్‌తో అనుసంధానం వంటి కార్యక్రమాలను అమలు చేసింది. వీటితో పాటు.. బతుకమ్మ చీరెల పథకాన్ని అమల్లోకి తెచ్చి వాటి ఆర్డర్లను కూడా నేతన్నలకు అందించింది. ఫలితంగా కార్మికులకు చేతి నిండా పని దొరికింది. అక్కడితో ఆగకుండా రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా వారికి అందించింది. దీంతో సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసింది. పవర్ లూమ్‌లను ఆధునికీకరించుకునేందుకు సబ్సిడీపై రుణాలు ఇచ్చి వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. వీటికితోడు నేతన్నకు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు కేసీఆర్. దీంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నేతన్నల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పడుతున్న అవస్థలు, వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యల వంటి అంశాలను పేర్కొంటూ ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేనేత సమస్యలపై కేటీఆర్ లేఖ రాశారు. అయినా ప్రభుత్వం మాత్రం మొండి వైఖరితో ముందుకెళ్తున్నది.

మళ్లీ చీకటి రోజులు

గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నేతన్నలకు రూ.3 వేల కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చి అండగా నిలిచింది. యారన్ సబ్సిడీ రూ. 32.67 కోట్లు కార్మికులకు ఇచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీ రాగానే నేతన్నలపై కక్ష సాధింపు మొదలైంది. ఆర్డర్లను నిలిపివేసింది. దీంతో కార్మికులు నిరసనలు చేపట్టారు. ఆ మేరకు అత్తెసరుగా రూ.50 కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో ఆ ఆర్డర్ల పనులు మూడునాళ్ల ముచ్చటే అయ్యాయి. ఆ తర్వాత ఆర్డర్లు ఇవ్వకపోవడంతో సిరిసిల్లలో దాదాపు 30 వేల మరమగ్గాలు మూతపడ్డాయి. ఇందులో పనిచేసే 20 వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లలో మాట్లాడుతూ గత ప్రభుత్వానికన్నా మెరుగైన ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని, పెండింగ్ బకాయిలు కూడా దశలవారీగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ.. నేటి వరకు అందులో ఏ ఒక్క హామీ అమలు కాలేదు. దీంతో మళ్లీ చీకటి రోజులు వచ్చాయని నేతన్నలు ఆవేదనకు లోనై, బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ఇప్పుడు మాకెవరు దిక్కు?



కేసీఆర్ ఉన్నప్పుడు నా కొడుకు సాయి బతుకమ్మ చీరెల బీములు నింపిండు. పదేండ్లు చేతినిండా పని ఉండి, తగ్గట్టు కూలి వచ్చింది. పక్షవాతం వచ్చి మంచాన పడ్డ నా భర్త కైలాసంను, నన్ను పోషించిండు. గిప్పుడు కాంగ్రెస్ సర్కారోళ్లు ఆర్డర్లు ఇత్తలేరని సేట్లు సాంచాలు బంద్ పెట్టింండ్రు. నాలుగు నెలల నుంచి పనిలేక ఇంట్లనే ఉంటుండు. పరిస్థితి సూసి సాయి ఏమనుకున్నడో ఏమో. కూలిపోయిన ఇంటోకి పోయి ఉరేసుకున్నడు. చెట్టంత కొడుకు మాకు దూరమైతడని అనుకోలే.

- అడిశర్ల పద్మ (చనిపోయిన సాయి తల్లి)

ఆత్మహత్యలు చేసుకున్న నేత కార్మికులు

1. తడుక శ్రీనివాస్ (మరమగ్గాల కార్మికుడు)
   చనిపోయిన తేదీ : 11-3-2024, బీవైనగర్, సిరిసిల్ల
2. సిరిపురం లక్ష్మీనారాయణ (62) (మరమగ్గాల కార్మికుడు)
   మరణం: 6-4-2024, రాజీవ్‌నగర్, సిరిసిల్ల
3. ఈగ రాజు (45)(మరమగ్గాల కార్మికుడు)
   మరణం: 22-4-2024, నెహ్రూనగర్, సిరిసిల్ల
4. అంకారపు మల్లేశం (60) (మరమగ్గాల కార్మికుడు)
   మరణం: 25-04-2024
   ఇందిరానగర్, తంగళ్లపల్లి మండలం
5. అడిశర్ల సాయి (26) (వార్పిన్ కార్మికుడు)
   మరణం: 25-4-2024

బీమా పైసలే ఆదుకున్నయ్



నాకు భార్య నిర్మల, ఇద్దరు కొడుకులు. దిలీప్(22), ఆదిత్య. నేను సాంచాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. పెద్ద కొడుకు దిలీప్ మరమగ్గాల భీములు నింపే వార్పర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణలో నాకు ఆసరయ్యేటోడు. చిన్నోడు ఆదిత్య ఇంటర్ చదువుతున్నడు. గతేడాది ఆగస్టు నెలలో అనారోగ్యం బారిన పడిండు. దవాఖానలో చేర్పించినం. చికిత్స పొందుతూ నాలుగు రోజులకు చనిపోయిండు. చికిత్సకు రూ.2.50 లక్షల దాకా ఖర్చయ్యింది. అయినా బతుకలేదు. కేసీఆర్ కల్పించిన నేతన్న బీమా కింద రూ.5 లక్షలు వచ్చినయ్. ఆడబ్బులే మమ్మల్ని ఆదుకున్నయ్. నేను ఏండ్ల సంది సాంచాలు నడుపుతున్న. ఒకప్పుడు పన్నెండు సాంచాలు నడిపించినా నెలకు రూ.10 వేలు కూడా రాలేదు. బతుకమ్మ చీరెలు నడిపితే నెలకు రూ.15 నుంచి రూ.20 వేలు వచ్చినయ్. యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ పథకాలు మాకు అండగా నిలిచినయ్. ఆ పథకాలను అలాగే కొనసాగించాలి.

- దూడం లక్ష్మణ్, నేత కార్మికుడు, ఇందిరానగర్, సిరిసిల్ల

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు



పదేండ్ల కేసీఆర్ పాలనలో కార్మికులకు చేతినిండా పని దొరికింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్రమాలు జరిగాయంటూ వస్త్ర తయారీ ఆర్డర్లు నిలిపివేసింది. పెండింగ్ బకాయిలు రూ.300 కోట్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు యథాతథంగా కొనసాగించాలని, ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించాం. నాలుగు నెలలుగా పరిశ్రమ బంద్ ఉన్నందున కార్మికులు కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకుంటున్నరు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.50కోట్లు యజమానుల ఖాతాల్లో వేయకుండా ఆసాములకు ఇచ్చి ఇరువురి మధ్య చిచ్చు పెట్టింండ్రు. పరిశ్రమను మూసివేసేందుకు కుట్ర పన్నుతున్నరు. ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

- మూషం రమేశ్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

లోకం పోకడ



బయట ప్రచారంలో నా మీద వ్యతిరేక ప్రసంగాలు చేస్తే మీకు తిండి బంద్!

ఎండా కాలం

	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	45.2°c	31.6°c
ఆదిలాబాద్	44.5°c	24.5°c
మెదక్	43.6°c	21.8°c
రంగారెడ్డి	42.9°c	18.3°c
నిజామాబాద్	42.7°c	26.8°c
మహబూబ్‌నగర్	42.3°c	29.6°c
హైదరాబాద్	42.3°c	26.3°c
కరీంనగర్	42.0°c	27.0°c
ఖమ్మం	42.0°c	25.0°c
వరంగల్	41.0°c	27.0°c

రాష్ట్రంపై 'నిప్పుల వాన'

- పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- జమ్మికుంటలో అత్యధికంగా 45.6 డిగ్రీలు
- మరో ఐదు రోజులు తీవ్ర వడగాడ్పులు
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు
- 28-30 మధ్యన పలు జిల్లాల్లో వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): భగభగలాడుతున్న వేసవి భానుడు శుక్రవారం రాష్ట్రంపై 'నిప్పుల వాన' కురిపించాడు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, వనపర్తి, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో తీవ్ర వడగాడ్పులు వీచడంతో ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 సెల్సియస్ డిగ్రీలకుపైగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అత్యధికంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 45.6, నల్లగొండ జిల్లా నిడమనూర్, పెద్దపల్లి జిల్లా మంథనిలో 45.2, యాదాద్రి భువనగిరి జిల్లా మర్యాల, కరీంనగర్ జిల్లా వీణవంక, జగిత్యాల జిల్లా వెల్లటూర్, కాల్వాయి, నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో 45.1, నల్లగొండ జిల్లా మాటూర్‌లో 45, కానాయిపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. జిల్లాలవారీగా భద్రాద్రి కొత్తగూడెంలో 43.5, నిజామాబాద్‌లో 43.4, నల్లగొండ, ఖమ్మం, రామగుండంలో 43, మహబూబ్‌నగర్, మెదక్‌లో 42.5, ఆదిలాబాద్‌లో 42.3, హనుమకొండలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపింది. రానున్న ఐదు రోజులు పలు జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని, ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇండ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. శనివారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 30న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొన్నది.

వర్ష సూచన

ఇదే సమయంలో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు తెలిపింది. 28న కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 29న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. 30న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించింది.



కొండా సురేఖకు ఈసీ వార్నింగ్

- కేసీఆర్, కేటీఆర్‌లపై నిందారోపణలు సరికాదని హితవు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)వార్నింగ్ ఇచ్చింది. రాజకీయ పార్టీలు, వ్యక్తులపై నిందారోపణలు చేయడం సరికాదని ఆమెను హెచ్చరించింది. ఇకపై ఎన్నికల సభలు, సమావేశాలు, పత్రికా సమావేశాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా మాట్లాడొద్దని సూచిస్తూ శుక్రవారం ఆమెకు ఓ లేఖ రాసింది. ఈ నెల 1న కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్‌లపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన విషయం విదితమే. దీనిపై బీఆర్‌ఎస్ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం స్పందించింది. ఆ మీడియా సమావేశంలో సురేఖ ఏం మాట్లాడారో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఫిర్యాదులో పేర్కొన్న విధంగానే సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయని కలెక్టర్ ధ్రువీకరించడంతో ఆమెను ఎన్నికల సంఘం హెచ్చరించింది.

రైతుబంధు ఏమైంది సీతక్క?

- 3 ఎకరాలకు పడలేదని రైతు ఆగ్రహం
- బ్యాంకు లోపం కావచ్చని చెప్పి వెనుదిరిగిన మంత్రి

ములుగు, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : పంట పెట్టుబడి సాయం తమకు అందలేదని మంత్రి సీతక్కను రైతులు నిలదీశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవాపూర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తుండగా గ్రామానికి చెందిన రైతు జంబుల నర్సయ్య రైతుబంధు విషయమై మండిపడ్డారు. తనకు మూడు ఎకరాల భూమి ఉన్నదని, పెట్టుబడి సాయం ఎందుకు అందించడం లేదని మంత్రిని నిలదీశారు. గ్రామ ముఖ్య నాయకులను ఉద్దేశించి నర్సయ్య మాట్లాడుతూ.. రైతుబంధు పైసలు ఎందుకు పడలేదో అడగాలని కోరుతూ మంత్రి ప్రసంగానికి అడ్డుపడ్డారు. దీంతో అక్కడ ఉన్న మహిళలు సైతం ఆరు గ్యారెంటీలపై నిలదీశారు. చేసేదేమీ లేక మంత్రి సీతక్క ప్రసంగాన్ని ఆపి రైతు బంధు పైసలు బ్యాంకులో సమస్య వల్ల పడకపోవచ్చని, బ్యాంకుకు వెళ్లి చూసుకోవాలని సముదాయించి వెనుదిరిగారు.

రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్



ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 26: రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్.. ఉద్యమం చేసి సీఎం కాలేదు, బ్రోకరిజం చేస్తూ సీఎం అయ్యాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరిని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఒక పార్టీలో గెలిచి ఇతర పార్టీలో చేరితే పిచ్చి కుక్కల్లా రాళ్లతో కొట్టాలని సీఎం చెప్పారని, ఇప్పుడు కడియంను కొట్టాల్సిందే కదా? అని అడిగారు. రేవంత్, కడియం శ్రీహరిపై ఎవరైనా రాళ్లు వేయొచ్చని పేర్కొన్నారు. కడియం శ్రీహరి ఎస్సీ కాదని చెప్పిందే రేవంత్‌రెడ్డి అని తెలిపారు. కడియం శ్రీహరి ఎస్సీ కానప్పుడు కావ్య ఎలా ఎస్సీ అవుతారని, ఆమెకు వరంగల్ ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మాల, మాదిగల నుంచి రేవంత్‌రెడ్డి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నది బీజేపీ కాదని, రేవంత్ రెడ్డేనని స్పష్టం చేశారు. ఎక్కడికెళ్లినా దేవుళ్ల పేర్ల మీద ఒట్టు వేస్తున్నాడని మండిపడ్డారు.

మంద, బాబూమోహన్ నామినేషన్ల తిరస్కరణ

వరంగల్, ఏప్రిల్ 26(నమస్తేతెలంగాణ)/ మహబూబాబాద్ రూరల్/ నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో భాగంగా నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి మంద జగన్నాథం, వరంగల్ ఇండిపెండెంట్ అభ్యర్థి బాబూమోహన్ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం చేపట్టిన స్క్రూటినీలో నాగర్‌కర్నూల్‌లో 13, వరంగల్ నియోజకవర్గంలో పది మంది నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సినీ నటుడు బాబూమోహన్ కూడా ఉన్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్ వివాదాస్పదంగా మారింది. నగేశ్ నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలు వెల్లడించలేదంటూ బీఎస్పీ అభ్యర్థి ట్విట్టర్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ నాయకులు రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- జనగామ, వికారాబాద్ జిల్లాల్లో ఘటనలు




ఉచ్చెంతల శ్రీను, అనంతయ్య (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/నర్మెట/ధారూరు : పంటలు చేతికి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జనగామ, వికారాబాద్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు ఇలా.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపురానికి చెందిన రైతు ఉచ్చెంతల శ్రీను (47) నాలుగు ఎకరాల్లో వేసిన వరి పంటను కాపాడుకునేందుకు నాలుగు బోర్లు వేసి నీళ్లు పడక.. కండ్ల ముందే పచ్చటి పొలం ఎండిపోయింది. సాగుపై పెట్టిన పెట్టుబడికి అదనంగా బోర్ల కోసం చేసిన ఖర్చు.. పైగా గత ఏడాది కొత్తగా కట్టుకున్న ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తోడైంది. పంట ఎండి.. తెచ్చిన అప్పులు తీర్చే దారి లేక తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను శుక్రవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమీప రైతులు చూసి వెంటనే జనగామ జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. 10 ఎకరాల భూమి ఉన్న ఆసామిగా శ్రీను 30 ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. నిరుడు ఇంటి నిర్మాణం కోసం, బోర్లు వేసేందుకు, సాగు పెట్టుబడికి రూ.పది లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు రాకేశ్, అరవింద్, కార్తీక్ ఉన్నారు. పెద్ద కొడుకు రాకేశ్‌కు ఇటీవలే పెండ్లి కుదిరింది. ఆగస్టులో ముహూర్తం పెట్టుకుందాం అనుకునేలోపు ఇంటి పెద్ద ఆత్మహత్యతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది. తరిగొప్పుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగారంలో పురుగుమందు తాగి..

వికారాబాద్ జిల్లా ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన ముసలిగల అనంతయ్య (42)కు 30 గుంటల పట్టా పొలం, ఆయన భార్య పేరిట లావణి పట్టా 2 ఎకరాలు ఉన్నది. 30 గుంటల పొలంలో వరి, 2 ఎకరాల్లో కంది, మక్క సాగు చేశాడు. వర్షాలు లేక కంది, మక్క పంటలు ఎండిపోయి నష్టం జరిగింది. రూ.3 లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. ఎవుసం సాగక, అప్పు తీర్చే దారి లేక తరుచూ బాధపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 22న మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆయనే వెళ్లి తాండూరు దవాఖానలో చేరాడు. ఈ నెల 25న మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో స్పృహ కోల్పోయాడు. దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఐఎన్సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్

దేశానికి పట్టిన దరిద్రం ఆ పార్టీ • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దేశంలో బ్రిటిష్ వారసత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఐఎన్సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని 'ఇటలీ నేషనల్ కాంగ్రెస్' అని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బ్రిటిష్ ప్రతినిధిగా ఇటలీకి చెందిన సోనియాగాంధీని దేశంపై రుద్దే ప్రయత్నం చేశారని, ఆమె ప్రధాని కాకుండా బీజేపీ అడ్డుకున్నదని చెప్పారు. పదేండ్ల కింద ఇటలీ కాంగ్రెస్‌ను ప్రజలు వదిలించుకున్నారని, మళ్లీ ఆ పార్టీని ప్రజలు దగ్గరకు రానిచ్చే ప్రసక్తే ఉండబోదని స్పష్టం చేశారు. బీజేపీ పక్కా లోకల్ పార్టీ అని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని అన్ని సమస్యలకు కారణం కాంగ్రెస్సే అని, దేశానికి పట్టిన దరిద్రం ఆ పార్టీ అని ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే రిజర్వేషన్లు ఉండవంటూ ప్రచారం చేస్తున్నారని, 'మతి భ్రమించి మాట్లాడుతున్నారా?' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముస్లిం రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన తీసుకొచ్చారని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు గండి కొడుతున్నదని ఎవరో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలను బీసీలుగా మారుస్తున్నారని, ఇది బీసీలకు అన్యాయం చేయడం కాదా? అని ప్రశ్నించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను బరాబర్ రద్దు చేస్తామని చెప్పారు.

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ

- రిజర్వేషన్ల రద్దుకే బీజేపీకి 400 సీట్లు కావాలట
- మోదీ కాలనాగులాంటోడు.. పగబడతాడు: రేవంత్



మెదక్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని, బ్రిటిష్ జనతా పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మతాలు, జాతుల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని దోచుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. శుక్రవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దు చేసేందుకే 400 సీట్లు కావాలని బీజేపీ నేతలు అంటున్నారని విమర్శించారు. 'మేమిద్దరం.. మాకు ఇద్దరు' అన్నట్టు మోదీ, అమిత్‌షాకు అదానీ, అంబానీ తోడయ్యారని ఆరోపించారు. నల్ల చట్టాలపై కొట్లాడిన రైతులపై మోదీ పగపట్టారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి రైతులను అదానీ, అంబానీలకు బానిసలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు.

నియమావళిని ఉల్లంఘించిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి పెద్దశంకరంపేటలో నిర్వహించిన సభలో హామీలిచ్చి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఇంటర్ విద్యార్థుల కోసం మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ, పీజీ కళాశాల, ఇండస్ట్రియల్ క్లస్టర్, ప్రాంతీయ పారిశ్రామీకరణ కేంద్రం ఏర్పాటు, సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు పెద్దశంకరంపేటలో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

పన్ను చెల్లించకుంటే.. కరెంట్ 'కట్'

- *పట్టణ ప్రజలకు జనగామ పురపాలక కమిషనర్ హెచ్చరిక*

జనగామ, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : 'ఇందుమూలంగా జనగామ పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇంటి పన్ను వడ్డీపై 90శాతం రిబేట్ (రాయితీ) ఇచ్చినప్పటికీ కొంత మంది ఇంటి పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోలేదు. దీంతో మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నది. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి పన్నుల చెల్లింపులో అలసత్వం వహించినందున మీ ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేస్తున్నాము'.. ఇది జనగామ పురపాలక సంఘం కమిషనర్ విడుదల చేసిన పత్రికా ప్రకటన సారాంశం. పన్ను చెల్లించని వారి ఇండ్లకు కరెంటు కట్ చేస్తామని పట్టణ ప్రజలను హెచ్చరిస్తూ జనగామ పురపాలక కమిషనర్ విడుదల చేసిన ప్రకటనపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. పన్ను చెల్లింపునకు పవర్ కట్‌కు..మున్సిపల్ కమిషనర్‌కు ఏం సంబంధం..? ఇది ప్రజా పాలనా? లేక ప్రజలను భయపెట్టే పాలనా? అంటూ జనం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గతంలో ఏనాడూ ఇలాంటి ప్రకటన చూడలేదని..ఇంటి పన్ను చెల్లించకుంటే నల్లా (కుళాయి) నీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరికలు చేయడం చూశాం కానీ..ఇంటికి కరెంటు కట్ చేస్తామని బెదిరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇంటి పన్నులు, నల్లా పన్ను మున్సిపల్ పరిధిలోని అంశం.. కరెంటు ట్రాన్స్‌కో పరిధిలోని అంశం.. మరి మున్సిపల్ కమిషనర్ కరెంటు ఎలా కట్ చేస్తారు? అంటూ జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమమే ఊపిరిగా..

- పదేండ్లు మినహా తక్కిన కాలమంతా రణగర్జనే
- చీల్చిన చోటే.. చిచ్చరపిడుగులా కేసీఆర్ మహాగర్జన
- నేడు బీఆర్ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా అవతరించి యావత్‌దేశాన్ని మంత్రముగ్ధం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 23 ఏండ్ల క్రితం జలదృశ్యంలో పురుడుపోసుకున్న బీఆర్ఎస్ పార్టీ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తన లక్ష్యాన్ని ముద్దాడటం ఓ అపూర్వఘట్టం. 23 ఏండ్ల ప్రస్థానంలో దాదాపు 14 ఏండ్లు రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం సాగించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్, రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తొమ్మిదిన్నరేండ్లపాటు అధికారంలో కొనసాగింది. ఆ స్వల్పకాలంలోనే పరిపాలనలో అద్భుతాలు చేసి చూపించింది. అనేక రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్ది తెలంగాణ కీర్తిని ఎలుగెత్తి చాటింది. బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు లిఖించిన ఆ అసాధారణ చరిత్రకు భవిష్యత్తు లేకుండా చేస్తాననే వాదనలు ఇప్పుడే కాదు, అప్పుడూ వినిపించాయి. అసలు పార్టీ నే లేకుండా చేస్తామన్న వాళ్లు, చేయాలని కుతూహలం ప్రదర్శించినవాళ్లు చతికిలపడిపోవడం, ఈ గడ్డ నుంచి వేరుపడిపోవడం మన కండ్ల ముందే జరిగింది. అసమాన వ్యూహ చతురత, అద్వితీయ కార్యదీక్షగల కేసీఆర్ చేతిలో బీఆర్ఎస్ పదిలంగా పదునెక్కి ముందుకు సాగుతున్నది. 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో ఎగురవేసిన గులాబీ జెండా దిగ్విజయంగా 23 ఏండ్లు పూర్తిచేసుకొని 24వ ఏట అడుగుపెడుతున్నది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అస్తిత్వమే ప్రాతిపదికగా ఏర్పడిన బీఆర్ఎస్ అనేక ఎత్తుపల్లాలను చవిచూసింది.

బీఆర్ఎస్ ఏది చేసినా సంచలనమే

పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఏది చేసినా సంచలనమేనని బీఆర్ఎస్ నిరూపిస్తూ వస్తున్నది. చెల్లాచెదురుగా ఉన్న తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి స్వరాష్ట్ర సమరంలో భాగస్వాములను చేసింది. దేశ రాజకీయాల్లో తమకు ఎదురేలేదని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ పరాజయభారాలతో బిక్కచచ్చిపోయిన వేళ, 2004 లో బీఆర్ఎస్‌తో పెట్టుకున్న పొత్తే ఆ పార్టీకి ప్రాణం పోసింది. 'తెలంగాణ కోసం గొంగలి పురుగునైనా ముద్దు పెట్టుకుంటా, కుష్టురోగినైనా కౌగిలించుకుంటా'అని నాడు కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్పించిన ఘనత కేసీఆర్‌దే. ఆనాడు ముందుచూపుతో అనుసరించిన వ్యూహమే 2009 డిసెంబర్ 9 ప్రకటనకు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసింది. 2001లో కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జన బహిరంగసభ నుంచి, 2010 డిసెంబర్ 16న వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ మహాగర్జన దాకా తెలంగాణలోని దాదాపు ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ డివిజన్‌లోనూ కేసీఆర్ నిర్వహించిన బహిరంగసభ లెన్నో. బస్తీబాట, పల్లెనిద్ర, తండానిద్రా ఇలా అనేక రూపాల్లో దాదాపు 14 ఏండ్లపాటు అవిశ్రాంత పోరాటం సాగించారు.

చీలికల కుట్రలు, ఫిరాయింపులు కొత్తమీ కాదు

రాష్ట్ర ఆవిర్భావం తరువాత 2014 జూన్‌లో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోగానే ఇక ఆ పార్టీ పని అయిపోయిందనే వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించడం మొదలైంది. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌తోపాటు కొద్దిమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ పార్టీని వీడారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని, ఆ పార్టీ నుంచి గెలిచిన వారిని ఎవ్వరినీ మిగలనీయమని, 25 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ మంత్రులు భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఇలాంటి ఆటుపోట్లు బీఆర్ఎస్‌కు కొత్తకాదు. ఎన్నో కుట్రలను తిప్పికొడుతూ నిలిచి గెలిచింది. బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) పార్టీ పుట్టిన మూడు నాలుగేండ్లకే ఆ పార్టీ ఎమ్మెల్యేలను 2005లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చీల్చింది. నాటి ముఖ్యమంత్రి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేవీపీ ఇద్దరూ కలిసి టీఆర్ఎస్‌ను చీల్చుతున్నారంటూ నాటి ఎమ్మెల్యే కాసీపేట లింగయ్య (బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాకపోయినా) ప్రకటించి కాంగ్రెస్ కుయుక్తులను బయటపెట్టారు. జయప్రకాశ్‌రెడ్డి, బండారు శారారాణి, కంభంపాటి లక్ష్మారెడ్డి, సోయం బాపూరావు, నారాయణరావు పటేల్, మందాటి సత్యనారాయణరెడ్డి, దుగ్యాల శ్రీనివాసరావు సహా 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ కొనుగోలు చేసిందని గ్రహించిన తెలంగాణ సమాజం వారిని ద్రోహులుగా ప్రకటించి ఊరూరా ఉద్యమాలు చేసింది. ఆ తరువాత 2009లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిసి తెలంగాణ అగ్నిగుండమైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడం, కేసీఆరే పాలనా బాధ్యతలు స్వీకరించడం, వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడం ఎన్నటికీ మరుపురాని చరిత్ర.

నాడు, నేడు నాగర్‌కర్నూల్‌లో..

21 ఏండ్ల క్రితం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాకతాళీయమో, యాదృచ్ఛికంగానో నాగర్‌కర్నూల్‌లో ఉన్నారు. 2003 సెప్టెంబర్ 15న నాగర్‌కర్నూల్ నగారాతో నల్లమలకొండల్లో జై తెలంగాణ నినాదం మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ నేడు (శనివారం) కూడా నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షోలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ప్రసంగించనున్నారు.

పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం అన్ని జిల్లాల పార్టీ కార్యాలయాల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ యావత్తు నిమగ్నమైన నేపథ్యంలో ఆవిర్భావ వేడుకలను జిల్లా కార్యాలయ కేంద్రంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా పార్టీ కార్యవర్గంతోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 2001 ఏప్రిల్ 27న తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పుట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పార్టీ అహర్నిశలు కృషి చేసిందని వివరించారు. తెలంగాణభవన్‌లో ఉదయం 9 గంటలకు పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.

తెలంగాణ అస్థిత్వం బీఆర్ఎస్

- స్వరాష్ట్ర సాధన గమ్యాన్ని చేరాం
- పదేండ్ల పాలనలో ప్రజలకు ప్రగతి ఫలాలు
- పార్టీ శ్రేణులకు ఆవిర్భావ శుభాకాంక్షలు: కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల స్వరాష్ట్ర పోరాటాలను గమ్యానికి చేర్చిన తెలంగాణ అస్థిత్వ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి (నాటి తెలంగాణ రాష్ట్ర సమితి) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజలకు, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ.. ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిందని తెలిపారు. తద్వారా దేశం గర్వించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామిక వాదులందరికీ, ముఖ్యంగా తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు 23 ఏండ్లుగా పార్టీ ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. ప్రజల స్వరాష్ట్ర స్వయంపాలన ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో దారి, దరి దొరకని స్థితిలో ఉన్న తెలంగాణ సమాజానికి, ప్రజాస్వామిక పార్లమెంట్ పంథాలో దిక్సూచిగా నిలిచిందని తెలిపారు. వేల సంఖ్యలో, పలు స్థాయిల్లో నాయకత్వాన్ని తీర్చిదిద్ది రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, ప్రగతి పథంలో రాష్ట్రాన్ని నడిపించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందని వెల్లడించారు. ప్రపంచ రాజకీయ పార్టీల చరిత్రలో బీఆర్ఎస్‌ది ప్రత్యేక స్థానమని కొనియాడారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, పలు మైలురాళ్లు అధిగమించడానికి బలమైన పునాదులు వేసింది పార్టీ కార్యకర్తలేనని స్పష్టం చేశారు. ప్రజలతో, మేధావివర్గాలతో మమేకమై కొనసాగించిన వారి ఉద్యమ అంకితభావమే నేటి తెలంగాణ ప్రగతికి కారణమని శ్లాఘించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దన్నుగా నిలుస్తూ, ప్రజల ఆదరణ మరింతగా పొందేందుకు నాయకులు, కార్యకర్తలు ఈ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతినబూనాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌ను వీడేది లేదు

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

హనుమకొండ, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి తన రాజకీయ గురువని, తనను సొంత కుటుంబ సభ్యుడిగా చూసుకున్నారని సారయ్య తెలిపారు. ఆయన కుమారుడు రఘురాంరెడ్డికి ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కితే మర్యాదపూర్వకంగా అతడిని కలిసేందుకు ఖమ్మం వెళ్లినట్టు తెలిపారు. ఆర్ఎస్‌ది, తనది గురుశిష్యుల బంధమని, రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. తాను కాంగ్రెస్‌లో నాయకుడిగా ఎదగడంలో సురేందర్‌రెడ్డి పాత్ర కీలకమని, కష్టనష్టాల్లో తనకు వెన్నుదన్నుగా ఆర్ఎస్ నిలిచారని పేర్కొన్నారు. మర్యాదపూర్వకంగా కలిస్తే పార్టీ మారబోతున్నట్టుగా ప్రచారం చేయడం తగదని అన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తానని సారయ్య స్పష్టం చేశారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- అమరవీరుల త్యాగాలు ఆయనకేం తెలుసు?
- సమైక్యవాదుల ప్రతినిధిగా వ్యవహరిస్తుండు
- సీఎం పదవి రాజీనామాకు సిద్ధం కావాలి
- రేవంత్ జై తెలంగాణ అనలేదు
- హరీశ్‌రావుకు రాజీనామాలు ఏమైనా కొత్తనా?
- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అమరవీరులను, అమరవీరుల స్థూపాన్ని అవమానపర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాల గురించి, అమరవీరుల స్థూపం గురించి రేవంత్‌రెడ్డికి ఏం తెలుసని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి లాంటి వారి వల్ల అమరవీరుల ఆత్మ ఘోషిస్తున్నదని విమర్శించారు. వారి త్యాగాలను అవమానించే విధంగా మాట్లాడిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్థూపాన్ని తాకే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని స్పష్టంచేశారు. అమరవీరుల స్థూపం చరిత్ర ఏం తెలుసునని, కొందరు రేవంత్ చెంచాలు, బచ్చగాళ్లు అమరవీరుల స్థూపం మలినమైందని శుద్ధి చేస్తారా? అని ఫైరయ్యారు. ఏ కార్యక్రమం మొదలు పెట్టాలన్నా బీఆర్ఎస్ ముందుగా అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పిస్తామని, స్థూపాన్ని దైవంతో సమానంగా భావిస్తామని చెప్పారు. అమరవీరుల త్యాగాల గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడటం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని మండిపడ్డారు. ఒక్కనాడైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నావా? ఒక్కనాడైనా జై తెలంగాణ అన్నవా..రేవంత్‌రెడ్డి? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, చంద్రబాబుకు, సమైక్యవాదులకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు పదవులకు రాజీనామా చేయమంటే పారిపోయింది మీరు కాదా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన మీరా.. తెలంగాణ ఉద్యమకారుల గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. పదవులను గడ్డిపోచలా వదులుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి ఉన్నదని స్పష్టంచేశారు. హరీశ్‌రావుకు రాజీనామాలు ఏమైనా కొత్తనా? అని ప్రశ్నించారు.

కొడంగల్లో ఓడిపోతే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నదెవరు?

1969 కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగంగానే ఆనాడు 369 మంది అమరులు అయ్యారని, అందుకే వారికి నివాళులుగా అమరవీరుల స్థూపాన్ని కట్టుకున్నామని ఎర్రోళ్ల చెప్పారు. అమరవీరుల స్థూపం 2014 ముందు హైదరాబాద్‌లో మాత్రమే ఉండేది, కానీ ప్రతి నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రజలు స్వచ్ఛందంగా నిర్మించుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ లేకపోతే ముఖ్యమంత్రి అయ్యేవాడివా... తెలంగాణ రాకపోతే అదే సమైక్యవాదుల అడుగులకు మడుగులు వత్తేవాడివని రేవంత్‌పై నిప్పులు చెరిగారు. గతంలో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, మాటతప్పి మళ్లీ మల్కాజిగిరిలో పోటీచేసింది నువ్వు కాదా? అని రేవంత్‌ను నిలదీశారు. పంద్రాగస్టున 2 లక్షల రుణమాఫీతోపాటు 8 గ్యారెంటీలు అమలు చేయాలని, లేదంటే కొడంగల్ ప్రజలను మోసం చేసినట్టుగా అందరినీ మోసం చేసినట్టుగా తెలంగాణ ప్రజలు భావిస్తారని చెప్పారు.

కేసీఆర్ తలకాయ మేం తీసేయాలా?

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధికారంలో ఉండగా 'తల నరుక్కుంటా' అని చెప్పి అనేక హామీలు అమలు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు మొదటి సీఎంను దళితుడిని చేయకపోతే మెడ నరుక్కుంటా అని కేసీఆర్ పది లక్షల సార్లు అన్నారని, రెండుసార్లు అధికారంలోకి వచ్చినా చేయలేదని పేర్కొన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. 'నువ్వు తలకాయ తీసేయలేదు కదా.. మమ్మల్ని తియ్యమంటవా? లేకపోతే దళితులు తలకాయ తీయాలా?' అని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రైతులపై ప్రేమ ఉన్నట్టు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజీనామా పత్రం ఒకటిన్నర లైన్ మాత్రమే ఉండాలని, ఒకటిన్నర పేజీ రాసుకొచ్చారని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే రుణమాఫీ చేసేందుకు ప్రయత్నించామని, బ్యాంకులకు డబ్బు చెల్లించాల్సి రావడంతో వీలుకాలేదని పేర్కొన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ హామీ నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

నేనొచ్చా.. నువ్వెక్కడ రేవంత్?

- రాజీనామా సవాల్‌కు ఎందుకు వెనకాడుతున్నవ్?
- రావట్లేదంటే.. ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నట్టే లెక్క
- అమరుల స్థూపం వద్దకు రాలేకపోతే పీఏతో పంపు
- ఉద్యమ జర్నలిస్టుల చేతుల్లో నా రిజైన్ లెటర్ పెడుతున్న
- హామీలు అమలు చేసి, నా రాజీనామా ఆమోదించుకో
- తర్వాత వచ్చే ఉప ఎన్నికల్లో కూడా నేను పాల్గొనను
- గన్‌పార్క్ వద్ద మాజీమంత్రి హరీశ్‌రావు ఓపెన్ చాలెంజ్



సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ చేసి శుక్రవారం తన రాజీనామా పత్రంతో అమరవీరుల స్థూపం వద్ద మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో వివిధ పత్రికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల యాడ్‌లను చూపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, వివేకానంద, తలసాని శ్రీనివాస్, బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి గారూ! అమరవీరుల స్థూపం దగ్గరికి వచ్చేశా. ఇదిగో నా రాజీనామా లేఖ. నువ్వెక్కడ? ఎందుకు వెనకడుగు వేస్తున్నవ్? రాజీనామాకు ముందుకు రావటం లేదంటే ఈ రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నట్టే' అని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు.. శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి తన రాజీనామా పత్రాన్ని ఉద్యమ జర్నలిస్టుల చేతుల్లో పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణలోని నా అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్, నా నిరుద్యోగ సోదరులకు రూ.4 వేల భృతి, మా రైతన్నలకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుబంధు, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్, మా ఆడబిడ్డలకు రూ.2,500 ఆగస్టు 15లోపు అమలు చేయండి. ఇవేమీ నేను కొత్తగా అడుగుతున్నవి, మా గొంతెమ్మ కోర్కెలేమీ కావు. ఎన్నికల్లో మీరు బాండు పేపర్లపై రాసిచ్చిన హామీలు. వీటన్నింటినీ నెరవేర్చి నా రాజీనామాను ఆమోదించుకోండి. లేకపోతే మీరూ రాజీనామా చేయండి' అని సీఎం రేవంత్‌కు ఓపెన్ చాలెంజ్ చేశారు. రేవంత్ చివరికి దేవుళ్లను కూడా వదలకుండా ప్రమాణాలు చేస్తూ.. రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేది నిజమే అయితే గన్‌పార్క్ దగ్గరకు రావాలని డిమాండ్ చేశారు. 'ఇక్కడ అమరుల సాక్షిగా ప్రమాణం చేద్దాం. మేధావులు లేదా జర్నలిస్టుల చేతుల్లో ఇరువురి రాజీనామాలు పెడదాం. ఆగస్టు 15లోగా ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ, వందరోజుల్లో అమలు చేస్తామని బాండుపేపర్లపై రాసిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తే.. నా రాజీనామా పత్రాన్ని నేరుగా స్పీకర్‌కు ఇవ్వండి. నేను మళ్లీ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేయను. ఇదే విషయం స్పష్టంగా చెప్పాను. ఒక వేళ ఆరు గ్యారెంటీలు, రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే మీ రాజీనామాను గవర్నర్‌కు ఇవ్వడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అని సూటిగా ప్రశ్నించారు.

రావట్లేదంటే.. మోసం చేస్తున్నట్టే లెక్క

దేవుళ్లపై ప్రమాణం చేసి, ఒట్లు పెట్టుకొని, బాండ్లపేపర్లపై రాసిచ్చిన హామీలు నిజమే అయితే.. రాజీనామా చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజీనామాకు ముందుకు రావటం లేదంటే.. ప్రజలను మరొక్కసారి మోసం చేస్తున్నట్టేనని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఏనాడూ అమరవీరుల స్థూపం వద్దకు రాలేదని గుర్తుచేశారు. 'ఇక్కడ కొచ్చి రెండు పూలు పెట్టింది లేదు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించిన చరిత్ర మీకు లేదు. ఇది మా దురదృష్టం. మీరు గన్‌పార్క్‌కు రావడం, రాకపోవడం మీ విజ్ఞత. ఒకవేళ మీరు రాకపోతే, అమరుల స్థూపం వద్దకు పూలు సమర్పించాల్సి వస్తుందేమోనన్న భేషజాలు ఉంటే.. కనీసం మీ స్టాఫ్ ద్వారానైనా మీ రాజీనామా పత్రం ఇక్కడ పెట్టండి. నేను ఇక్కడుండే జర్నలిస్టులకే నా రాజీనామా లేఖను ఇచ్చి వెళ్తున్నా.. మా జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమకారులు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు, మేధావులు అద్భుతంగా పోరాడారు. వాళ్ల చేతుల్లోనే నా రాజీనామా లెటర్ పెడుతున్నా. నువ్ అన్ని హామీలు అమలు చేస్తే వారు నేరుగా నా రాజీనామాను స్పీకర్‌కు ఇవ్వొచ్చు. ఒకవేళ మీరు కూడా ఇలాగే లెటర్ పెడితే అది మీ పెద్దరికాన్ని నిలబెడతది. ఒకవేళ మీరు రాజీనామా లెటర్ ఇవ్వకపోతే మీరు దేవుళ్ల పేరు మీద ప్రజలను మోసం చేస్తారని భావించాల్సి వస్తుంది. ప్రధాన ప్రతిపక్షంగా మా ఆశ, మా ప్రయత్నం రాష్ట్రంలోని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించటమే. అదే మా కర్తవ్యం. నేను రాజకీయాలకు అతీతంగా, స్వచ్ఛందంగా ముందుకొచ్చాను. నేను స్పీకర్ ఫార్మాట్‌లో కూడా రాజీనామా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా' అని వెల్లడించారు. తమకు రాజకీయాలకంటే, ఎమ్మెల్యే పదవి కంటే పేద ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయించే బాధ్యత తమదని, నాడు స్వయంగా సోనియాగాంధీ లేఖ రాశారని గుర్తుచేశారు. డిసెంబర్ 9న తొలి సంతకం ఆరు గ్యారెంటీల మీద పెడతామని, రుణమాఫీపై పెడతామని చెప్పి మాట తప్పినందుకు రేవంత్‌రెడ్డి ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఆగస్టు 15లోగా నైగా అన్ని హామీలు నెరవేస్తే సంతోషమేనని తెలిపారు.

హరీశ్ సవాల్‌ను స్వీకరించాలి: తలసాని

చెప్పినమాట ప్రకారం మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా లేఖ తీసుకొని వచ్చారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సీఎంకు ధైర్యం ఉంటే హరీశ్ రాజీనామా సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాకపోయినా సీఎం రేవంత్‌కు తీరిక ఉన్నప్పుడు గన్‌పార్క్‌కు వచ్చి సవాల్ స్వీకరించాలని అన్నారు. ఓట్ల కోసం లేనిపోని హామీలు ఇస్తామంటే కుదరదని, డిసెంబర్ 9న ఇస్తామన్న రుణమాఫీ ఏమైంది? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి దంపతులు, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా హరీశ్‌రావుకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు గన్‌పార్క్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపగా.. పోలీసులు రోప్ పార్టీతో వారిని చెదరగొట్టారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు అమరులకు నివాళి అర్పించారు.

హరీశ్ లేఖ యథాతథంగా..

గౌరవనీయులైన తెలంగాణ శాసన సభాపతి గారికి..

విషయము : శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 2 లక్షల రూపాయల రుణమాఫీ హామీతో పాటు ఆరు గ్యారంటీల్లోని మొత్తం పదమూడు హామీలు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు ఆగస్టు 15న అమలు చేస్తే, నేను నా శాసనసభ్యత్వానికి అదే రోజు రాజీనామా చేసినట్టు పరిగణించి ఆమోదం తెలపాలని కోరటం గురించి..

2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల రూపంలో ప్రజలకు 13 హామీలు ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వీటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇవికాకుండా 2023 డిసెంబర్ 9 నాడు రైతులకు ఉన్న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కూడా చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 140 రోజులు దాటినా మహాలక్ష్మి పేరిట ప్రతి నెలా 18 ఏండ్లు దాటిన వారందరికీ రూ.2,500 చొప్పున ఇస్తామన్న హామీ నేరవేరలేదు. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున, రైతు కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున చెల్లించటం, పంటలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించటం అనే హామీలు నెరవేరలేదు. ఇందిరమ్మ ఇండ్ల కింద 5 లక్షల రూపాయలివ్వడం, ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇవ్వటం ఆచరణకు నోచుకోలేదు. యువ వికాసం కింద 5 లక్షల రూపాయల విలువైన విద్యాభరోసా కార్డు ఇస్తామని, ప్రతి మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. చేయూత కింద ఇచ్చిన హామీ అయిన ఆసరా పెన్షన్లను 2 వేల రూపాయల నుంచి 4 వేల రూపాయలకు పెంచటం కూడా అమలు కాలేదు. రూ.2 లక్షల రుణమాఫీ హామీని ఆగస్టు 15లోపు అమలు చేస్తానని దేవుడిపై ఒట్లు తింటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ హామీతో పాటు వంద రోజుల్లో పూర్తి చేస్తామని చేయలేని గ్యారంటీలను కూడా ఆ రోజులోగా నెరవేర్చాలని డిమాండ్ చేశాను. ఆగస్టు 15లోగా నెరవేర్చకపోతే సీఎం రాజీనామా చేయాలని నెరవేరిస్తే నేను రాజీనామా చేస్తానని సవాల్ విసిరాను. నా సవాల్‌కు కట్టుబడి నేను ఈ రాజీనామా ప్రతిపాదన లేఖను మీ ముందు ఉంచుతున్నాను. 2024 ఆగస్టు 15లోగా పైన పేర్కొన్న హామీలన్నింటినీ అమలుచేసిన పక్షంలో ఈ లేఖను నా రాజీనామాగా పరిగణించి ఆమోదించాలని కోరుతున్నాను.

ఇట్లు...
తన్నీరు హరీశ్‌రావు, శాసనసభ్యుడు, సిద్దిపేట



అమరవీరులకు కాంగ్రెస్ అవమానం

- చెప్పులేసుకొని అమరుల స్థూపంపై స్పీచ్‌లు
- ఒక్క పువ్వుతోనూ నివాళి అర్పించని నేతలు
- బీఆర్ఎస్ పూలదండలను ఊడ్చేసిన ఇందిరా
- హస్తం నేతల నుంచి వినిపించని 'జై తెలంగాణ'

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలు పవిత్రంగా భావించే గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ నాయకులు అవమానకర రీతిలో ప్రవర్తించారు. అమరుల త్యాగాలను లెక్కచేయకుండా చెప్పులేసుకొని స్థూపం వద్ద హంగామా సృష్టించారు. ఏకంగా చెప్పులేసుకొనే స్థూపం గద్దె పైకి ఎక్కి మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీశ్‌రావు తన రాజీనామా పత్రంతో గన్‌పార్క్‌కు వచ్చి నివాళులు అర్పించిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో పలువురు నాయకులు అమరుల స్థూపం శుద్ధిపేరుతో నానా యాగి చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున కనీసం ఒక్క పువ్వును కూడా అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించలేదు. కానీ, బీఆర్ఎస్ నాయకులు అమరులకు సమర్పించిన పూలను కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇందిరా శోభన్ ఊడ్చిపడేశారు. పూల దండలను పక్కకు విసిరివేశారు. పువ్వులను చేతులతో కాకుండా కాళ్లతో నెడుతుండగా, కాంగ్రెస్ నాయకురాలు కొండ్రడు పుష్పలత కాలుజారి కిందపడ్డారు. పక్కనే ఉన్న మీడియా ప్రతినిధులు ఆమెను లేపి, సపర్యలు చేశారు. పసుపు నీళ్లతో స్థూపాన్ని శుద్ధిచేసే క్రమంలో కాంగ్రెస్ నాయకులు తమపై నీళ్లు చల్లుకున్నారు. అనంతరం అమరుల స్థూపం మెట్లపై చెప్పులు వేసుకుని మీడియాతో మాట్లాడేందుకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముందుకు రాగా.. తప్పు తెలుసుకొని చెప్పులు విప్పేసి మాట్లాడారు.

స్థూపంపై చెప్పులతోనే స్పీచ్‌లు..

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతుండగా కాంగ్రెస్ మహిళానేత, సినీనటి దివ్యవాణి చెప్పులతో అమరుల స్థూపం పైకి ఎక్కారు. ఆమెతోపాటు మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ సైతం షూతో నిలుచొనే మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ పక్కన ఉన్న మరో నేత కూడా స్థూపంపై చెప్పులు ధరించే మాట్లాడారు. ఒక్క కాంగ్రెస్ నేత, కార్యకర్త కూడా 'జై తెలంగాణ' అని నినదించలేదు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మలి అడుగు.. మరింత దృఢంగా!



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

గతంలో నేను టీడీపీలో ఉన్నపుడూ, ఆ తర్వాత తెలంగాణ జన సమితిలో ఉన్నపుడూ కేసీఆర్ బొమ్మ చూసిన ప్రతిసారీ అనుకునేది ఈయన తల అచ్చు తెలంగాణ రూపంలో ఉంది కదా అని. ఈ మాట మీకు సైకోఫ్యాన్సీ లాగా అనిపించవచ్చు కూడా. కానీ, అప్పటి ప్రత్యర్థి పార్టీ నాయకుడి పట్ల నాకీ అభిప్రాయం రావడం కచ్చితంగా ఆయనకు ఒక నికార్సయిన కాంప్లిమెంట్ లాంటిదే.

చంద్రబాబు నాతో ఎన్నోసార్లు అనేవారు 'రాజకీయాల్లో ప్రత్యర్థులను విమర్శించడంలో వెరపు ఉండకూడదు. అదే సమయంలో వారి శక్తియుక్తులను గుర్తించడం మరువకూడదు' అని. పబ్లిక్‌గా ఏం మాట్లాడినా... నడుస్తున్న చరిత్రను 'కాలం' లాగా రాగద్వేషాలకు లోనుకాకుండా గమనించడం రాజకీయవాదులకు ఉండవలసిన లక్షణం. ఈ కోణంలో నా ఈ వ్యాఖ్యలను చూడాలి చదువరులు.

Love him or hate him but you cannot ignore him అంటరు ఇంగ్లీషులో. గతంలో కేసీఆర్‌ను విమర్శించిన మేధావులు, బుద్ధిజీవుల పరిస్థితి ఇదే నేడు తెలంగాణలో. కేసీఆర్‌ను నాడు వ్యతిరేకించినవారు నేడు ఆలోచిస్తున్నరు. ఆయన మరువదగనివాడు అంటున్నరు. 'కేసీఆర్ వల్ల తెలంగాణకు జరగవలసిన మేళ్ళు చాలా ఉన్నయి' అంటున్నరు ఆయనపై శరపరంపర విమర్శలు గుప్పించే సంపాదకులు కూడా!

పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై ఏ రోజూ ఒక మంచి మాట అననివారు నాతోనే ఇపుడు అంటున్నరు 'ఆయన ఎంతో చేసిండు తెలంగాణకు. కేసీఆర్ లేని భౌగోళిక తెలంగాణ లేదు, కేసీఆర్ పాత్ర లేని ప్రగతి తెలంగాణ లేదు' అని. మరిపుడు కేసీఆర్ ఆనవాలు లేకుండా చేస్తా అనే మరుగుజ్జుల మాటలు... అందునా తెలంగాణ ఆత్మ లేని వికృత మనస్కులు అంటే నవ్వొస్తున్నది! వారందరికీ దిమ్మతిరిగి బొమ్మ కనపడేలాగ నాలుగు గంటల సినిమా చూపించిండు కేసీఆర్ మొన్న టీవీ9 ఇంటర్వ్యూలో. అది దాన వీర శూర కర్ణ కంటే పెద్ద సినిమా. ఎన్టీఆర్‌వి మూడు పాత్రలైతే, కేసీఆర్‌ది విశ్వరూపం; సాధికార, సగర్వ తెలంగాణ స్వరూపం. నేను దశాబ్దంన్నర కిందటనే అనుకున్న తెలంగాణ కేసీఆర్‌ను పోలి ఉన్నదేమి అని. కేసీఆర్ తెలంగాణను పోలి ఉన్నడు అనడం కూడా అంతే నిజం నేడు.


ఇరవై మూడేండ్ల కింద ఇదే రోజు పుట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి బుడిబుడి నడకలలోనే నమోదు చేసుకున్న విజయాలు నేను ఏకరువు పెట్టడం చర్వితచర్వణం అవుతుంది. అవి మీకందరికీ తెలుసు. హిస్టరీని (చరిత్ర) మాత్రమే కాదు, తెలంగాణ భౌగోళిక రాష్ట్ర రూపంలో జాగ్రఫీని సృష్టించిన మహానేత కేసీఆర్. 'కేసీఆర్ ఒక వ్యవస్థ' అని ఆయనే స్వయంగా చెప్పుకోవడం డాంబికం ఏమీ కాదు. అందరూ అట్ల చెప్పుకోలేరు. చెప్పుకోవాలంటే స్వయంగా తాము నమ్మాలి కదా? నమ్మాలంటే గతమూ వర్తమానమూ భవిష్యత్తూ తోడు రావాలి కదా? ఆ మూడింటికీ ప్రియమైన చెలికాడు కేసీఆర్. కాబట్టే అంటున్నది ఆయన ఆనవాలు చెరిపేయడం అంటే అదొక పరిహాసాస్పద, అల్ప విన్యాసం! సర్వభ్రష్టులు మాత్రమే అట్లా మాట్లాడగలరు.

నిజానికి వారి ఆత్మన్యూనతయే (inferioritycomplex) ఆత్మవిశ్వాస (superioritycomplex) రూపంలో వారినే మోసం చేస్తూ ఉంటుంది. నిరంతరం తనను తాను మోసగించుకొంటూ, తన చుట్టూ ఉండే ఆశావహ అనుచరులనూ, సమాజాన్నీ మోసం చేయ సాహసిస్తున్నడు రేవంత్ రెడ్డి. అది వికటిస్తోందన్న ఎరుక కలిగినపుడు నోటి వెంట బూతులు ధారాళంగా వస్తున్నయి!

తెలంగాణ ప్రజానీకాన్ని మోసగించి ఇచ్చిన అలవిమాలిన ఎన్నికల హామీలు నేరవేర్చలేమని జ్ఞానోదయమై, పార్లమెంట్ ఎన్నికల భూతం భయపెడుతూ ఉండగా వరుస అబద్ధాలతో జనాలను మభ్యపెట్టాలని చూస్తున్నడు. అధికారం చేతికిచ్చి పాలించండయ్యా అంటే అది చేతగాక పదేండ్ల పాలనలో రంధ్రాన్వేషణ చేస్తున్నడు ఈనాడు, ఆంధ్రజ్యోతి లాంటి మీడియా సహా కొందరు వంకర మనస్కుల దన్నుతో!

రైతుబంధు, రైతు బీమా, మద్దతు ధర, నాణ్యమైన విద్యుత్తు, సాగునీరు, తాగునీరు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు, గురుకులాల రూపంలో అందరికీ అద్భుతమైన చదువు, మండల కేంద్రాల్లో సైతం వైద్య సేవలు, ప్రభుత్వ/ప్రైవేట్‌రంగాల్లో ఉపాధి కల్పన లాంటి విధానాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచింది పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన. దేశంలోనే నెంబర్ 1 స్థానం ఊరికే రాలేదు. గాలిలో మాటల మంత్రదండం ఊపితే కాలేదు. ప్రజలపై అపారమైన ప్రేమ, అనితర సాధ్యమైన దార్శనికత, భవిష్యత్తు అవసరాలపై అవగాహన, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించే కార్యసాధకత్వం మూర్తీభవించిన పాలకుడైన కేసీఆర్ నిజంగా తెలంగాణకు వరప్రదాయకుడు!

నేడు బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఇట్లాంటి పదేండ్ల అద్భుత ప్రగతి చిత్రాన్ని వంద రోజుల్లో చెరిపేయగలగడం ఎవరికి సాధ్యం? ఎన్నో రంగుల వెలుగు జిలుగుల తెలంగాణను తుంటరి పెయింటర్ లాగా పిచ్చి రంగులతో మకిలి పట్టించిండు రేవంత్‌రెడ్డి. అయినా... ఆందోళన అవసరం లేదు. వారివి ఉత్తరకుమార చేష్టలు. తెలంగాణ సాధకుని సంకల్పం ముందు అవన్నీ దూదిపింజెలు. ఈ నెల 24 నుంచి మే 10 వరకు కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు వస్తున్న అద్భుత స్పందన, పోటెత్తుతున్న జనం, వారు ఏకరువు పెడుతున్న సమస్యలు, కేసీఆర్ మాత్రమే తమ సమస్యలు తీర్చగలడన్న వారి ఆశాభావం చెపుతున్నయి మూడునెలల మోసపు పాలన గురించి; 420 దొంగ హామీల దగా గురించి!

ఎన్నికల్లో ఓడిపోయి, తుంటి ఎముక విరిగి, మోదీ ప్రతీకార రాజకీయాలకు కూతురు జైలుపాలై, నమ్మిన నాయకులు మోసం చేసినా మానసికంగా కుంగిపోలేదు కేసీఆర్. ఆయన ఆవేదన ఒక్కటే! సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ నేడు ఎన్నికల్లో దగాపడి, అభివృద్ధి ఆశలు ఆవిరై, సంక్షేమ సంకల్పం నీరుగారి, భవిష్యత్తు అంధకారమైందన్న విషయం ఆయనను బాధపెడుతున్నది. తన వ్యక్తిగత కష్టాలు దాటి ఆలోచించే నాయకుడాయన. అందుకే నడుంకట్టిండు. ఆయన పట్టుకున్నది చేతికర్ర కాదు; తెలంగాణ బిడ్డల దీవెనల ఊతకర్ర!

నేడు తెలంగాణమంతా ఏకమవుతున్నది. ఎందుకు మాకీ దుర్గతి అని మొన్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినవారు సైతం ఆవేదన చెందుతున్నరు. పాలిచ్చే బర్రెను కాదని, దున్నపోతును తెచ్చుకున్నమని అంగలారుస్తున్నరు. మొన్నటి ఆయన ఇంటర్వ్యూను అది ప్రసారమవుతున్న సమయంలోనే కోటి మందికి పైగా చూసిన్రు. 'బలగం' సినిమా లాగానే ఊళ్ళల్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటుచేసుకుని చూసిన్రు. తమ నాయిన, తమ అన్న, తమ పెద్ద కొడుకు చెప్తున్న మాటలను మనసుతో విన్నరు. కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుగులైయితున్నది. కేసీఆర్ అడుగేస్తే అదురుతున్నడు రేవంత్. అందుకే... ఆయన వెంబడే కాలువల నీళ్లు పరుగెట్టుకుంటూ ఒస్తున్నవి; ఆయన వస్తున్నడని తెలిసి మంత్రులు, అధికారులు రైతుల తలుపులు తడుతున్నరు. కేసీఆర్ శక్తి చూసిన జనం ఇపుడు ఆయన యాత్రకు నీరాజనం పడుతున్నరు. ఆయన ఒస్తే సమస్యలు పరిష్కారమవుతాయని, ఆయన వస్తే ప్రభుత్వం ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయక తప్పదని అనుభవపూర్వకంగా తెలిసిపోయింది. కేసీఆర్‌పై నిందలు వేయాలన్న కసితో ఉన్న నీళ్లు కూడా వదలక పంటలు ఎండబెట్టిన రేవంత్ దుర్మార్గం జనాలకు అర్థమైంది. కాబట్టే కేసీఆర్‌కు మహాదరణ!

ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నాయకుని పాత్రకు పూర్తి న్యాయం చేస్తున్నరు కేసీఆర్. ఆయనకు మరింతగా జవసత్వాలు ఇవ్వడం ఇపుడు తెలంగాణ బిడ్డల పని. నాడు మహా బలశాలురైన సమైక్య పాలకులనే ఎదిరించి స్వరాష్ట్రం సాధించుకున్న మనం సాధించలేనిది ఏమున్నది?

సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే; రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో తననూ, తన పార్టీనీ, తెలంగాణనూ సర్వతోముఖాభివృద్ధి బాట పట్టిస్తున్న కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు ఇపుడు, రాష్ట్రం సమైక్య పాలనప్పటి కష్టాల్లో కూరుకుపోయినపుడు మనందరం దన్నుగా ఉందాం. బీఆర్‌ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం చేకూరుద్దాం. కేసీఆర్‌ను మహాబలుడిగా చేద్దాం.

పుట్టిన రోజు నాడు బీఆర్‌ఎస్ ఏసయ్య రెండో రాకడను తలపించాలి. మలి అడుగు పడాలి.. మరింత దృఢంగా. ఇది కేవలం పార్టీ నాయకుల కార్యకర్తలకు వదిలివేయకూడదు. ప్రజానీకం బాధ్యతగా తీసుకోవాలి, తెలంగాణ హక్కులకు దఖలు పడాలి!

గన్‌పార్క్ సాక్షిగా మరో రుజువు



టంకశాల అశోక్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 26వ తేదీన గన్‌పార్క్‌కు తన రాజీనామా పత్రంతో వెళ్లకపోవటమే మంచిదైంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలుకు మళ్లీ మళ్లీ పెడుతున్న గడువులు, అన్నీ వట్టి మిథ్య అని ప్రజలకు దానితో తిరుగులేకుండా తేలిపోయింది. అదేవిధంగా ఆగస్టు 15 కొత్త గడువుతో దేవుళ్లపై వేసుకుంటున్న ఒట్లు అంతే అబద్ధమని కూడా ప్రజలకు అర్థమైపోయి ఉండాలి.

రెండు తెలుగు రాష్ర్టాలలో సంచలనంగా మారిన ఆ ఉదంతంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆ రోజున, రేవంత్‌రెడ్డి సవాలు ప్రకారమే తన రాజీనామా పత్రాన్ని అడ్వాన్సుగా వెంట తీసుకొని గన్‌పార్క్‌కు వచ్చారు. ఒకే విడతలో రూ.2 లక్షల రైతు రుణమాఫీని, ఆరు గ్యారెంటీలలోని మొత్తం 13 హామీలను ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన కొత్త గడువు ఆగస్టు 15లోగా అమలు పరిచినట్టయితే, తను తెచ్చిన రాజీనామా మీడియా వారి ద్వారా ఆటోమేటిక్‌గా స్పీకర్‌కు వెళ్లిపోతుందన్నారు. కానీ రేవంత్‌రెడ్డి హరీశ్‌కు సవాలు అయితే విసిరారు గాని, తన లేఖతో తాను స్వయంగా గన్‌పార్క్‌కు రాలేదు. కనీసం తన సిబ్బందితో అయినా పంపలేదు. ఈ వ్యాసం రాసే సమయానికి ఎటువంటి ప్రకటన కూడా చేయలేదు. దీన్ని బట్టి, ప్రజలకు ఆయన హామీలు, గడువులు అన్నీ మిథ్య, దేవుళ్లపై ఒట్లు వట్టి అబద్ధమని స్పష్టంగా అర్థమవుతున్నది. ఇదంతా ప్రజలు స్వయంగా టీవీ చానళ్లలో చూసిందే.

కాంగ్రెస్ హామీలపై ప్రజలకు అడుగుబొడుగు ఆశలు, భ్రమలు ఇంకా ఏమైనా మిగిలి ఉంటే, అవి శుక్రవారం నాడు ఈ విధంగా పటాపంచలై ఉండాలి. ఈ ఉదంతంపై రానున్న రోజుల్లో ప్రజల మధ్య ముమ్మరంగా చర్చలు జరుగుతాయి. ఇదంతా కాంగ్రెస్ పార్టీ, దానితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కొని తెచ్చుకున్న ముప్పు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలతో అధికారానికి వచ్చిందని, కనుక ఇక్కడ కూడా అదేవిధంగా గ్యారెంటీలిస్తే గెలిచి తీరుతామని వారు నమ్మారు. కాని అందులో అనేకం అమలుకు సాధ్యం కావని పలువురు నిపుణులు, విజ్ఞులు కర్ణాటకలో చెప్పారు, తెలంగాణలో కూడా హెచ్చరించారు. కర్ణాటక ఎన్నికలు జరిగి ఈ నెలతో ఏడాది అవుతున్నది. అక్కడి హామీలు అనేకం ఇప్పటికీ అమలుకావటం లేదు. కొన్ని అరకొరగా మాత్రమే అమలవుతున్నాయి. దానితో ప్రజలలో నిరసనలు పెరుగుతున్నాయి. అప్పటి ఎన్నికల్లో అనేక ప్రజాసంఘాలు కలిసి కాంగ్రెస్‌కు మద్దతునిచ్చాయి. దానితో పాటు కాంగ్రెస్ గ్యారెంటీలు, అంతకుముందటి బీజేపీ ప్రభుత్వంపై ఉండిన వ్యతిరేకత కలిసి కాంగ్రెస్‌ను గెలిపించాయి. కానీ హామీలు నెరవేరకపోవటంతో అవే సామాజిక సంఘాలకు చెందిన ప్రముఖులు ఇప్పుడు అంటున్నదేమిటి?




అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్‌కు ఇచ్చిన మద్దతు ఒక 'కాంట్రాక్టు' వంటిది. దాని ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను అమలు పరచాలి. దానితో పాటు మంచి పరిపాలనను ఇవ్వాలి. అవినీతిని అరికట్టాలి. కాని, ఈ మూడింటిలో ఏదీ సరిగా జరగటం లేదు. హామీలకు నిధులు లేవని మంత్రులు స్వయంగా అంగీకరిస్తున్నారు. అందువల్ల ప్రజలకు కాంగ్రెస్‌తో ఏర్పడిన 'కాంట్రాక్టు' ముగిపోయినట్టే. ఈ స్థితిలో ప్రజలకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలనే నిర్ణయమైతే ఇంకా ఏమీ తీసుకోలేదు గాని, అసెంబ్లీ ఎన్నికలప్పటి వలె కాంగ్రెస్‌కు కట్టుబడి ఏమీ లేరు. సామాజిక సంఘాల ప్రముఖుల నుంచి వినవస్తున్న మాట ఇది.

తెలంగాణలో వరుసగా పదేండ్ల పాటు అధికారం లేక, ఏ విధంగానైనా గెలిచితీరాలని తపిస్తుండిన కాంగ్రెస్, కర్ణాటక తరహాలోనే వెనుక ముందు ఆలోచించకుండా అలవిగాని హామీలిచ్చింది. వాటి అమలుకు మొత్తం రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదని, అంతకుమించి మరొక 50 శాతం నిధులు అవసరమవుతాయని, అవెక్కడ తెస్తారని, పరిపాలనకు కావలసిన తక్కిన ఖర్చుల మాటేమిటని, అభివృద్ధి పనులెట్లా అని, ఎన్నికల ప్రచారం సమయంలోనే ప్రశ్నలు వినిపించాయి. హామీలకు అయ్యే ఖర్చెంతో అంచనాలు చెప్పాలని ఆర్థిక నిపుణులు కాంగ్రెస్‌ను కోరారు. కానీ ఏమి చేసైనా సరే అధికారానికి రావాలనే ఆతృతలో ఉండిన పార్టీ నాయకత్వం దేనికీ జవాబివ్వలేదు. రకరకాల డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలు ఎడాపెడా ప్రకటించటమే గాక, పత్రికలలో పూర్తి పేజీ అడ్వర్టయిజ్‌మెంట్లతో, బహిరంగసభ ప్రసంగాలతో చాలా హడావుడి చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలను గత ఎన్నికల ప్రచారాలలో ఎప్పుడూ ఏ పార్టీ చేయని విధంగా బాండ్‌పేపర్లపై రాసి ఇంటింటికి పంచిపెట్టారు. వాటిపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించటం కోసం డిక్లరేషన్ పత్రాలను రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలతో విడుదల చేయించారు. ఆరు గ్యారెంటీలను 100 రోజులలో అమలుపరిచే బాధ్యత స్వయంగా తనదంటూ సోనియాగాంధీతో రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాయించారు. అంతకుముందు వరకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అనేక హామీలను గణనీయంగా పెంచివేసి, వాటికి కొత్త హామీలు చేర్చి, ప్రజలను నమ్మించటం వీటన్నింటి ఉద్దేశం.

ఈ వ్యూహంతో కాంగ్రెస్ గెలిచిన మాట నిజమే. కానీ, ఆ వ్యూహమన్నది చివరికి కాంగ్రెస్‌ను తన గోయి తానే తవ్వుకునేట్టు చేసింది. అమలుచేయలేని ఆ హామీలు ముందు నుయ్యి వెనుక గొయ్యి వలె మారాయి. కర్ణాటకలో జరుగుతున్నదే ఇక్కడ కూడా మొదలైంది. కర్ణాటక ప్రజా సంఘాల ప్రముఖులు అక్కడి పరిస్థితి గురించి అంటున్న విధంగానే, ఇక్కడ తెలంగాణలో కూడా ప్రజలకు కాంగ్రెస్‌తో అసెంబ్లీ ఎన్నికల నాటి 'కాంట్రాక్ట్' ముగిసిపోతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది. అందుకు తార్కాణాలు ఒక్కొక్కటిగా కన్పిస్తున్నాయి కూడా. ఈ క్రమంలోని ఒక నాటకీయ పరిణామమే రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావుల మధ్య సాగిన సవాళ్లు, ప్రతి సవాళ్లు, గన్‌పార్క్ ఉదంతాలు.


ప్రభుత్వం మాత్రం అస్పష్టమైన ప్రకటనలు చేయటం మినహా, హామీల అమలుపై ఆడిటింగ్ పద్ధతిలో లెక్కలేమీ చెప్పటం లేదు. కాకపోతే రెండు మాటలు మాత్రం అనుకోవాలి. రైతు రుణమాఫీకి, ఆరు గ్యారెంటీలలోని 13 హామీల అమలు హరీశ్ గుర్తు చేస్తున్న ఆగస్టు 15 గడువునైనా ఆమోదించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా లేరని ఇప్పుడు స్పష్టమవుతున్నది.

తేదీలు ప్రకటించి మరీ ప్రభుత్వం ఏ వర్గానికి ఇచ్చిన హామీలు ఏమిటో, ఆ గడువు నాటికి జరిగిందేమిటో, జరగనిదేమిటో, తిరిగి పెడుతున్న కొత్త గడువులు ఏమిటో ఇప్పటికే విస్తారంగా మీడియాలో వెలువడ్డాయి. అంతకన్నా ముఖ్యంగా ప్రజల మధ్య ప్రతి గ్రామంలో చర్చలు సాగుతున్నాయి. అందువల్ల ఇక్కడ మరొకమారు వివరించనక్కర లేదు. ప్రభుత్వం మాత్రం అస్పష్టమైన ప్రకటనలు చేయటం మినహా, హామీల అమలుపై ఆడిటింగ్ పద్ధతిలో లెక్కలేమీ చెప్పటం లేదు. కాకపోతే రెండు మాటలు మాత్రం అనుకోవాలి. రైతు రుణమాఫీకి, 6 గ్యారంటీలలోని 13 హామీల అమలు హరీశ్ గుర్తుచేస్తున్న ఆగస్టు 15 గడువునైనా ఆమోదించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా లేరని ఇప్పుడు స్పష్టమవుతున్నది. కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల తర్వాత, స్థానిక సంస్థల ఎన్నికల గండం కూడా ఆగస్టు 15 నాటికి ముగిసే అవకాశం ఉన్నది. అయినప్పటికీ రుణమాఫీ, 13 హామీల అమలుపై ముఖ్యమంత్రికి తనపైన తనకే భరోసా ఉన్నట్టు లేదు.. అటువంటప్పుడు ఆయన పట్ల ప్రజలకెట్లా భరోసా కలగాలి? శుక్రవారం నాడు ముఖ్యమంత్రి గన్‌పార్క్‌కు రాకపోవటంతో, ఆగస్టు 15కు కూడా రుణమాఫీతో పాటు 6 గ్యారెంటీల అమలు పూర్తిచేయలేమని చెప్పకనే చెప్పినట్టయింది.



ఇదా దేశానికి తెచ్చే కీర్తి?

మోదీ మరోసారి దేశానికి కీర్తి తెచ్చారు! భారత్‌లో మానవ హక్కుల హననం జరుగుతున్నదని, మైనారిటీల మీద దాడులు జరుగుతున్నాయని అమెరికా హోం శాఖ నివేదిక వెల్లడించింది. విశ్వగురుతో పాటు ఇంకెవరైనా ఈ విషయాన్ని పట్టించుకుంటున్నారా?



- సాగరికా ఘోష్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

ఎటమటం



ఇచ్చిందెంత? నొక్కిందెంత?

ఎమ్మెల్యే ఎన్నికల్లో ఖర్చుపెట్టిన డబ్బులకు తగ్గట్టుగా ఓట్లు వచ్చాయా, లేదా? అని లెక్క తేల్చే పనిలో పడ్డారు మంత్రి జూపల్లి కృష్ణారావు. ఏ మండలానికి ఎన్ని డబ్బులు పంపింది, అందులో ఎంత ముట్టింది? అని పనిలో పనిగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఆయన ఆరా తీస్తున్నారు. ఎక్కువ డబ్బులు పంపిన చోటనేమో తక్కువ ఓట్లు, తక్కువ డబ్బులు పంపిన చోటనేమో ఎక్కువ ఓట్లు రావడం పట్ల జూపల్లికి అనుమానం వచ్చింది. దీంతో పంచాల్సిన డబ్బులు మధ్యలో నొక్కిసిన అనుచరుల బండారం బయట పడటంతో వారు మొకం చాటేస్తున్నారట. ఈ కూపీ లాగడం ఇప్పుడు అవసరమా? దీని వల్ల తనకు నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని ఎంపీ అభ్యర్థి మల్లు రవి ఆందోళన చెందుతున్నట్టు వినికిడి.



ఆ సంగతి చూడు ముందు

వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నారట. ఒకవైపు ఎంపీ ఎన్నికలు జరుగుతుంటే గాలికి వదిలేసి గాంధీభవన్‌లో జగ్గన్న టైమ్ పాస్ చేస్తున్నారనీ మండి పడుతున్నారు. నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ హయాంలో అలా జరిగింది, ఇలా జరిగిందని మీడియా వాళ్ల మెదడు తింటున్నారని ఎవరో ఫిర్యాదు కూడా చేశారట. దీంతో నెహ్రూ సంగతి తర్వాత ముందు పార్టీ అభ్యర్థి సంగతి చూడండి అని పెద్దలు సూచించినట్టు సమాచారం.



కర్మ కాకపోతే..?

గేట్లు తెరిచినా ఎమ్మెల్యేల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. దీంతో చోటా మోటా నాయకులు ఎవరు వచ్చినా చేర్చుకోమని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించింది. చివరికి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్స్‌గా పోటీ చేసి పార్టీ ఓటమికి కారణమైన వారు వచ్చినా చేర్చుకోవాల్సిందే అని స్పష్టం చేసింది. ఖర్మ ఏం చేస్తాం నా ఓటమికి కారణమైన వాడి మెడలో నేనే కండువా కప్పాల్సి వచ్చిందని చేరికల కమిటీ నాయకుడు జగ్గన్న వాపోయారు.



బొమ్మలు పెట్టుకోక తప్పలేదు

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు, నేనేమీ మోదీ, అమిత్ షా బొమ్మలు పెట్టుకొని గెలువలేదని ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఇప్పుడు అదే రఘునందన్ రావు తరఫున ప్రచారం చేయడానికి ప్రధాని మోదీ, అమిత్ షా ఇద్దరూ వస్తున్నారు. గెలిస్తే సరి, ఓడితే మటుకు వారి బొమ్మలు పెట్టుకోవడం వల్లనే తాను ఓడిపోయానని రఘునందన్ అంటారేమో చూడాలి మరి.

- వెల్జాల

గిరిజన యూనివర్సిటీ సాధిస్తా



ఆదిలాబాద్‌పై కేంద్రం చిన్నచూపు • యూనివర్సిటీని ఇచ్చినట్టే ఇచ్చి మోసం

ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడే ఉద్యమాలు • కాంగ్రెస్‌ను గెలిపించి బాధపడుతున్నరు

బీజేపీ దేశానికి శ్రేయస్కరం కాదు • 'నమస్తే' ఇంటర్వ్యూలో ఆత్రం సక్కు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోనే అత్యధిక గిరిజన జనాభా కలిగిన ఆదిలాబాద్‌పై కేంద్రం చిన్న చూపు చూస్తున్నదని బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు విమర్శించారు. గతంలో ట్రైబల్ యూనివర్సిటీ ఇచ్చినట్టే ఇచ్చి వేరే ప్రాంతానికి తరలించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనను గెలిపిస్తే ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీ తీసుకురావడంతోపాటు ఆదిలాబాద్ నుంచి ఆర్మూరు వరకు రైల్వేలైన్, రెబ్బనలో ఓవర్ బ్రిడ్జి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఎంపీ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతున్నది?

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నాం. పోలింగ్ బూత్‌లవారీగా కమిటీలు పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రచారం చేస్తున్నాం. కార్యకర్తలు, నాయకులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించి తీరుతాం.

బరిలో ఉన్న ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు గోండు తెగకు చెందిన వారే. ప్రజలు మీవైపే ఉంటారని ఎలా భావిస్తున్నారు?

నేను ఉద్యమం నుంచి వచ్చిన వాడిని. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలోనే ఆదివాసీల కోసం ఉద్యమాలు చేశా. వారి ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చా. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందా. ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్నా. ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆదివాసుల సమస్యలు తెలియవు. నావైపే ఆదిలాబాద్ ప్రజలు, ఆదివాసీలు ఉన్నారని నమ్ముతున్నా. వారు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా.

రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అంటోంది. దీనిపై మీరేమంటారు?

ప్రపంచ మేధావి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఎస్సీఎస్టీలకే కాదు, బీసీ, ఇతర అణగారిన వర్గాలకు రక్షణ కవచం వంటిది. ఇలాంటి రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ ప్రకటించడడం దేశానికి శ్రేయస్కరం కాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులను కాలరాసేందుకే బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నది. రాజ్యాంగాన్ని మారిస్తే ఎవరూ ఊరుకోరు.

ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ రిజర్వేషన్లపై కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాలు చేసింది. కేంద్రం వాటిని పక్కన పెట్టింది. దీనిపై మీ స్పందన ఏమిటి?

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. వాటిని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొక్కిపెట్టింది. కేంద్రం మెడలు వంచైనా వాటిని సాధించేందుకు కృషి చేస్తా.

కాంగ్రెస్, బీజేపీ తమతోనే అభివృద్ధి సాధ్యం అంటున్నాయి. దీనిపై మీ కామెంట్?

జాతీయ పార్టీలకు వాటి ప్రయోజనం తప్ప అభివృద్ధి పట్టదు. వారికి కావాల్సిన నాయకులు ఉన్న ప్రాంతాలను మాత్రమే పట్టించుకుంటారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై ఏ జాతీయ పార్టీకీ చిత్తశుద్ధి లేదు. ప్రాంతీయ పార్టీలతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?

బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించి తప్పు చేశామని బాధపడుతున్నారు. ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన నాకు కేసీఆర్ ఎంపీగా అవకాశం కల్పించడంపై ఆదివాసీలతోపాటు, జిల్లా ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని ప్రజలే బాహాటంగా ప్రకటించడం సంతోషంగా ఉంది. కార్యకర్తలు, పార్టీ నాయకులు అందరు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు. స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నారు.

స్పందించని రేవంత్

మొదటిపేజీ తరువాయి...

ప్రకారం శుక్రవారం ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు రాజీనామా పత్రంతో హరీశ్‌రావు వచ్చారు. రాజీనామా లేఖను బహిరంగంగా అందరికీ చూపించారు. ఉద్యమ జర్నలిస్టులకు దానిని అందజేశారు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అక్కడికి రాలేదు. దీంతో హరీశ్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని రేవంత్‌రెడ్డి చేసినవన్నీ ఉత్తి ప్రగల్భాలేనని తేలిపోయిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. హరీశ్‌రావుకు పదవులకు రాజీనామా చేయడం కొత్తేమీ కాదని గుర్తు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల కోసం అనేకసార్లు పదవులకు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శించారని, రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసం రాజీనామాకు సిద్ధం అయ్యారని చెప్తున్నారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం ఇప్పటివరకు రాజీనామా చేసిన చరిత్ర లేదని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయం చేస్తున్నారని చెప్తున్నారు.

మీకిస్తే.. మాకేంటి?

మొదటిపేజీ తరువాయి...

పూర్తిగా వేయలేదు.

- రాష్ట్రంలో ఉద్యోగులు... ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల బకాయిలు, ఇన్సూరెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితరాలకు సంబంధించిన బిల్లులు నాలుగైదు నెలలుగా పెండింగులోనే ఉన్నాయి. ఎస్టీవో టోకెన్స్ వచ్చినప్పటికీ ఖజానా నుంచి బిల్లులు రాకపోవడంతో వారంతా చెప్పులరిగేలా తిరుగుతున్నారు.
- రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు నెలలుగా జీతభత్యాలు, ఆశ వర్కర్లకు నాలుగు నెలలుగా టీఏ, డీఏలు రాలేదు. ఇలాంటి చిరుద్యోగులకు నెలల తరబడి జీతాలు పెండింగులో ఉండటంతో ఆ కుటుంబాలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నాయి. గురుకులాల్లో పని చేసే ఐసీటీ కంప్యూటర్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం ఎక్స్ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

పాత బిల్లులకు క్లియరెన్స్!

ఒకవైపు గత నాలుగు నెలల ఆర్థిక శాఖ లెక్కలేమో ప్రభుత్వ ఆదాయాన్ని ఘనంగానే చూపుతున్నా.. అన్నదాతకు రైతుబంధు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులెందుకు రావడం లేదు? ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలను సైతం అరిగోస ఎందుకు పెడుతున్నారు? ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయం ఎక్కడికి పోతున్నది? ఆర్థిక శాఖలో అసలు ఏం జరుగుతున్నదని పెద్ద చర్చనీయాంశంగా మారింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోనూ బెంగళూరు తరహా కమీషన్ల దందా విశృంఖలంగా కొనసాగుతున్నదా? అన్న చర్చ సాగుతున్నది. అధికారిక, రాజకీయవర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు ఖజానా నుంచి నిధులు పక్కదారి పడుతున్నాయని, బ్యాక్‌డోర్‌లో పర్సంటేజీల పందేరంతో సర్కారు ఆదాయం పాత బిల్లుల క్లియరెన్స్‌కు మళ్లిపోతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల వ్యయానికి నిధులను సమీకరించడంలో నిమగ్నమైన పెద్దలు 20 శాతం కమీషన్‌తో పాత బిల్లులకు మోక్షం కలిగిస్తున్నట్టు అధికార, రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా ఒక సన్నిహితుడు 'స్వామి కార్యం... స్వకార్యం' అన్నట్టు 10–11 శాతంతో పాత బిల్లులకు మోక్షం కలిగిస్తూ 'సింహ' భాగం దండుకుంటున్నారని చెప్పుకొంటున్నారు. పార్టీ ముఖ్యులంతా ఎన్నికల బిజీలో ఉన్న తరుణంలో సందట్లో సడేమియాగా సదరు వ్యక్తి ఉదయం లేచింది మొదలు పెండింగు బిల్లుల క్లియరెన్స్‌తోనే యమ బిజీగా ఉన్నట్టు సెక్రటేరియట్ అధికారికవర్గాల్లో చర్చ సాగుతున్నది.

చక్రం తిప్పుతున్న సన్నిహితుడు

కర్ణాటకలో గతంలోని బీజేపీ సర్కారుపై 40 శాతం కమీషన్ అంటూ ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన అక్కడి కాంగ్రెస్.. తెలంగాణ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రంలో అదే తరహా దందాను కొనసాగించినట్టు అప్పట్లోనే బయటపడింది. తెలంగాణలో ఎన్నికల వ్యయం కోసం కర్ణాటక కాంగ్రెస్.. బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు బహిరంగంగా ఆరోపణలు చేశారు. అంతేకాదు.. బెంగళూరులో జరిగిన ఐటీ అధికారుల దాడుల్లో ఓ కార్పొరేటర్ ఇంట్లో భారీ ఎత్తున నగదు కూడా బయటపడింది. పార్లమెంటు ఎన్నికల వ్యయాన్ని సమకూర్చుకునేందుకుగాను పెద్దలు పెద్ద ఎత్తున పాత బిల్లుల క్లియరెన్స్‌కు తెరలేపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యుల ఆదేశంతోనే అధికారులు పాత దస్త్రాలను దులిపి మరీ వాటికి మోక్షం కల్పిస్తున్నట్టు చర్చ సాగుతున్నది. ఒక్కోసారి పార్టీ ఫండ్‌గా ఏకంగా 20 శాతందాకా కమీషన్ సమర్పించాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు కీలక నేతకు సన్నిహితుడైన ఒక వ్యక్తి ఆర్థిక శాఖలో చక్రం తిప్పుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయనకు 10–11 శాతం కమీషన్ సమర్పించుకుంటే గంటల వ్యవధిలోనే కోట్ల రూపాయల పెండింగు బిల్లులకు మోక్షం కలుగుతున్నట్టు కాంట్రాక్టర్లు చెప్పుకుంటున్నారు. అడిగినంత సమర్పించుకుంటే తప్ప తనకు సంబంధించిన 56 కోట్ల బిల్లులు క్లియర్ కాలేదని ఒక కాంట్రాక్టర్ వాపోయారు.

దిక్కుతోచని స్థితిలో సమర్పయామి

వాస్తవానికి ఇంత భారీ మొత్తంలో కమీషన్లు భారమే. నెలల తరబడి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగులో ఉండటంతో అప్పులు, బ్యాంకు రుణాలు తెచ్చి పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు వడ్డీల భారం పెరిగిపోతున్నది. దీంతో కాంట్రాక్టర్లు 10–20 శాతం కమీషన్లకు సైతం ముందుకొస్తున్నారు. గతంలో భూములపై పెట్టుబడులు పెట్టగా రాష్ట్రంలో రియల్ రంగం కుదేలవడంతో బడా కాంట్రాక్టర్లు దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. రియల్‌కు పూర్వ వైభవం వచ్చేదెప్పుడో.. అనే ఆందోళనతో అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక అలాంటి కాంట్రాక్టర్లు కమీషన్లు ఇచ్చేందుకు కూడా వెనుకాడటం లేదు. మరోవైపు పార్లమెంటు ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాజకీయ అనిశ్చితి నెలకొంటే పెండింగ్ బిల్లుల పరిస్థితి అటకెక్కే ప్రమాదముందని భయపడుతున్నారు. అందుకే కమీషన్ సమర్పించుకోవడమో, పవర్ సెంటర్‌ను ప్రసన్నం చేసుకోవడమో చేస్తున్నారు.



పట్టుబడిన గంజాయిని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గుమ్మల్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద దహనం చేస్తున్న ఎస్పీ చందనా దీప్తి

5.10 కోట్ల విలువైన గంజాయికి నిప్పు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 : నల్లగొండ జిల్లావ్యాప్తంగా పట్టుబడిన రూ.5.10 కోట్ల విలువైన 2,043 కిలోల గంజాయికి పోలీసులు నిప్పు పెట్టారు. పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 39 కేసుల్లో దీన్ని స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు దాన్ని శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గుమ్మల్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ.. గంజాయిని రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



బెర్లిన్‌లో జర్మనీ సంస్థ ప్రతినిధులతో వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

సౌర విద్యుత్తులోకి సిరిసిల్ల 'సెస్'

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/ వేములవాడ: సిరిసిల్ల సహకార విద్యుత్తు సంస్థ సోలార్ పవర్‌లోకి ప్రవేశించి మరో రికార్డు సృష్టించబోతున్నది. 1969లో జిల్లాలోని 13 మండలాల్లోని అన్ని గ్రామాలకు ఒకేసారి వంద శాతం విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చిన ఏకైక సహకార విద్యుత్తు సంస్థగా చరిత్ర పుటల్లోకి ఎక్కిన విషయం తెల్సిందే. తాజాగా సెస్‌ను సొంతంగా సౌర విద్యుదుత్పత్తిలోకి తీసుకొచ్చేందుకు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం జర్మనీ సంస్థ ప్రతినిధులతో తరచూ సమావేశమవుతున్నారు. అందులో భాగంగా గత నెల 27న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కలిసి చర్చలు జరిపారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తితో పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతోపాటు సెస్ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు పడే అవకాశం ఉన్నది. ఇందుకోసం అధికారులు సమగ్ర నివేదికలు రూపొందిస్తున్నారు. ఆగస్టు నెలలో హైదరాబాద్‌కు రానున్న జర్మనీ బృందంతో సెస్, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపనున్నారు.

ఏసీబీకి రూ.4లక్షలతో పట్టుబడిన డీఈ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణానికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బుద్ధభవన్‌లోని నార్త్ ట్యాంక్ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా యాత పవన్‌కుమార్ పనిచేస్తున్నారు. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలోని శాంతినగర్‌లో కమర్షియల్ భవనం నిర్మించేందుకు రామంతాపూర్‌కు చెందిన ఓ బిల్డర్ నిరభ్యంతరపత్రం (ఎన్‌వోసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీని కోసం డీఈ రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ మేరకు శుక్రవారం మొదటగా రూ.4లక్షలను బుద్ధభవన్‌లోని కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు పనుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘన కేసులు 6,366

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు భారీగా నమోదవుతున్నాయి. మార్చి మొదటి వారం నుంచి ఏప్రిల్ 26 వరకు మొత్తం 6,366 కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. వీటిల్లో గరిష్ఠంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కేసులు 5,967 నమోదయ్యాయి. నార్కోటిక్/డ్రగ్స్ కేసులు 104, ఐపీసీ కేసులు 274, ప్రజాప్రాతినిధ్య చట్టం కేసులు 21 ఉన్నాయి.

కాళేశ్వరంపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై వ్యక్తులు, సంస్థల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరించేందు కు ప్రత్యేకంగా పలు బాక్సులను బీఆ ర్కే భవన్‌లోని న్యాయ విచారణ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఏ ర్పాటు చేశారు. తొలి రోజున ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలు, డిజైన్లు, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు, నిధుల వినియోగం తదితర అంశాలపై జస్టిస్ పినాకిని ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఘోష్ ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు. విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేశారు. శనివారం మూడు బరాజ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించనున్నట్టు కమిషన్ తెలిపింది.

నేటి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు

- **మే 7 వరకు తుది గడువు, మే 26న పరీక్ష**
- **జేఈఈ మెయిన్ సిలబస్ తగ్గింపు**
- **అడ్వాన్స్‌డ్‌కు యథాతథం**

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ప్రతిష్ఠాత్మక ఐఐటీ ల్లో బీటెక్, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ –2024కు దరఖాస్తు నమోదు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభంకానున్నది. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఐఐటీ మద్రాస్ నిర్వహించనున్నది. అభ్యర్థులు మే 7 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు ఉన్నది. ఫీజు మాత్రం మే 10 సాయంత్రం 5 గంటల వరకు చెల్లించొచ్చు. జేఈఈ మెయిన్ ర్యాంకులు గురువారం విడుదలైన విషయం తెలిసిందే. జేఈఈ మెయిన్‌కు హాజరైన వారిలో నుంచి 2. 5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. క్యాటగిరీ వారీగా కటాఫ్ ర్యాంకులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. వీరంతా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

రెండింటికీ హాజరుకావాల్సిందే..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో భాగంగా నిర్వహించే రెండు పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలి. ఈ పరీక్షను మే 26న నిర్వహిస్తారు. రెండు పరీక్షలు రాసిన అభ్యర్థుల ఫలితాలను మాత్రమే ప్రకటిస్తారు. ఇదిలావుండగా, ఈ సారి జేఈఈ మెయిన్ సిలబస్‌ను కాస్త తగ్గించారు. కానీ, అడ్వాన్స్‌డ్‌లో మాత్రం యథాతథంగా పాత సిలబస్‌నే కొనసాగించారు. దీంతో అభ్యర్థులు ఆయా పాఠ్యాంశాలన్నీ చదవాల్సి ఉంటుంది.



శుక్రవారం సూర్యాపేటలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

రైతుల ధర్నా

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 26 : ఎన్నిమార్లు విన్నవించినా తమ సమస్యలు పరిష్కరించడం లేదని హమాలీలు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంటాలను నిలిపివేసి సమ్మెకు దిగారు. ఇదే సమయంలో కాంటాలు వేయాలని కోరుతూ రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆర్డీవో వేణు మాధవరావు, మార్కెట్ కార్యదర్శి రాహుల్ హమాలీలతో మాట్లాడి శనివారం ఉదయం వరకు కాంటాలు వేయిస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. మార్కెట్‌లో వినియోగిస్తున్న సూపర్ బస్తాలతో వేసవికాలంలో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్టు హమాలీలు వాపోయారు. తక్షణమే గన్నీ బస్తాలు పెట్టాలని, తమ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయాలని, ఖరీదుదారులే బస్తాలు, పురుకోసలు తెచ్చివ్వాలని డిమాండ్ చేశారు.

• ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీతో మధుమేహం దూరం

బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో ముగ్గురికి ఉపశమనం

బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్ వెల్లడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 26: ఊబకాయం వల్ల మధుమేహ సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్ వైద్యులు పూర్తి ఉపశమనం కల్పించారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీతో వారిని మళ్లీ సాధారణ స్థితికి చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన వినీత్‌కుమార్ బన్సల్ (35), వినయ్‌కుమార్ బన్సల్ (35), మదన్‌చందర్ బారిక్ (45) ఊబకాయం వల్ల గత పదేండ్ల నుంచి మధుమేహం, రక్తపోటు, నిద్రలేమి, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ ముగ్గురు కేర్ హాస్పిటల్‌లో బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్‌ను సంప్రదించడంతో విజయవంతంగా ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీని పూర్తిచేశారు. ల్యాప్రోస్కోపిక్ విధానంలో నిర్వహించిన ఈ శస్త్రచికిత్స తర్వాత వారి ఊబకాయంతోపాటు ఇతర సమస్యలన్నీ తగ్గుముఖం పట్టాయని డాక్టర్ పరీక్ వెల్లడించారు.

• కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు

కొనుగోలుకు టీఎస్‌ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. కొన్ని సందర్భాల్లో సీట్ల కోసం కొట్లాటలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీఆఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకొన్నది. 1500 ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వీలైనంత మేరకు అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సుల్ని ఆర్టీసీ తీసుకొంటున్నది. ఇప్పుడున్న పాత బస్సుల స్థానంలో కొత్తవి కొనేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్యాంకు రుణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

జూలై కల్లా 450 ఎలక్ట్రిక్ బస్సులు

ఇక పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇప్పుడు దాదాపు 105 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతుండగా.. మరో వెయ్యి పైచిలుకు రోడ్డెక్కించేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో జూలై కల్లా 450 అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా వచ్చే ఎలక్ట్రిక్ బస్సులను నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు.. అదేవిధంగా జిల్లాల్లో ఇతర ప్రాంతాలకు నడిపించేలా ఆర్టీసీ కార్యాచరణకు సిద్ధమవుతున్నది.

• టెట్‌కు మాక్‌టెస్టులు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మాక్‌టెస్టులను పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చింది. టెట్‌కు హాజరయ్యేందుకు ఈ ఏడాది 2.86 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఇదివరకు ఓఎమ్మార్ పద్ధతిలో టెట్ నిర్వహించగా, ఈ ఏడాది తొలిసారిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) మే 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తారు. https://tstet2024.aptonline.in/tstet/ వెబ్‌సైట్ ద్వారా మాక్‌టెస్టులకు హాజరై, ప్రాక్టీస్ చేసుకోవచ్చు.

• యూపీఎస్సీ ప్రిపరేషన్‌పై సెమినార్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : యూపీఎస్సీ సివిల్స్ పరీక్షపై విజన్ ఐఏఎస్ అకాడమీలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 36వ ర్యాంకు సాధించిన ఆయుషి ప్రధాన్, 50వ ర్యాంకు సాధించిన కేఎన్ చందన జాహ్నవిలచే 'టాపర్స్‌టాక్' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రిపరేషన్‌పై అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

• సీబీఐటీలో హ్యాక్‌ఎక్సిలరేట్ -2024


హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ ఎడ్యుటెక్ సంస్థ బై టెక్సల్ శుక్రవారం చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలజీలో జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించింది. మైక్రోసాఫ్ట్ సహకారంతో హ్యాక్‌ఎక్సిలరేట్ –2024 పేరిట నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో ఐఐటీ ఢిల్లీ సహా పలు విద్యాసంస్థలకు చెందిన 139 బృందాలు పాల్గొన్నాయి. హ్యాకథాన్‌లో విజేతలకు రూ. 2.75లక్షల నగదు బహుమతులు అందజేస్తామని బై టెక్సల్ సహ వ్యవస్థాపకుడు చరణ్ తాడేపల్లి తెలిపారు. కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ ప్రొడక్ట్ మేనేజర్ మణిదీప్ బిక్కిన, , సీబీఐటీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సీవీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

• మే 16 నుంచి డిగ్రీ వన్‌టైం చాన్స్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 26: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్‌టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 16 నుంచి నిర్వహించనున్నట్టు వెల్లడించారు. వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మా ఊళ్లో కాంగ్రెస్ ప్రచారం వద్దు!

- **ఆటోకు ఉన్న ఫ్లెక్సీని చింపేసిన స్థానికులు**
- **వరంగల్ జిల్లాలో చిలుకమ్మతండా ఘటన**



చిలుకమ్మతండాలో స్థానికులు చింపేసిన కాంగ్రెస్ ప్రచార ఫ్లెక్సీ

సంగెం, ఏప్రిల్ 26 : మా ఊరికి కాంగ్రెస్ ప్రచార రథం రావద్దంటూ స్థానికులు అడ్డుకొన్నారు. ప్రచార ఆటోకు ఉన్న ఫ్లెక్సీలను చింపివేశారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూర్ స్టేషన్ చిలుక మ్మతండాలో శుక్రవారం చోటుచేసుకొన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలా వరంగ ల్ మండలం వసంతాపురం గ్రామానికి చెందిన గుండె కారి జైపాల్ తన ఆటోను కాంగ్రెస్ ప్రచారం కోసం పెట్టాడు. ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎల్గూర్‌స్టేషన్ చిలుకమ్మతండాకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రచార వాహనాన్ని ఆపి భోజనం చేస్తుండగా అదే తండాకు చెందిన గుగులోత్ శంకర్, బానోత్ రాజు వచ్చి ప్రచార ఆటోకు ఉన్న ఫ్లెక్సీని చించివేశారు. ఎందుకు చించుతు న్నారని అడిగితే కాంగ్రెస్ బండి ఇక్కడ తిరుగొద్దని డ్రైవర్‌ను బెదిరించారు. డ్రైవర్ జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎల్ నరేశ్ తెలిపారు.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై, ఏప్రిల్ 26: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఆర్థిక, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటం, రూపాయి పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కితీసుకోవడం పతనానికి ఆజ్యంపోసింది. చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 609.28 పాయింట్లు నష్టపోయి 73,730.16 వద్ద ముగిసింది. ఒక దశలో 722.79 పాయింట్లు నష్టపోయింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ 150.40 పాయింట్లు కోల్పోయి 22,419.95 వద్ద స్థిరపడింది.



ఫారెక్స్ రిజర్వులు డౌన్

వరుసగా రెండోవారం 2 బిలియన్ డాలర్లు తగ్గిన నిల్వలు

ముంబై, ఏప్రిల్ 26: విదేశీ మారకం నిల్వలు మరింత పడిపోయాయి. వరుసగా రెండో వారం ఈ నెల 19తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.282 బిలియన్ డాలర్లు కరిగిపోయి 640.334 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 5.401 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ నెల 5తో ముగిసిన వారంలో రిజర్వులు రికార్డు స్థాయి 648.562 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతకుముందు సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయి 642.453 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ మారకం నిల్వలు మళ్లీ నాలుగేండ్ల తర్వాత ఈ గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. మరోవైపు, పసిడి రిజర్వులు 1.01 బిలియన్ డాలర్లు ఎగబాకి 56.808 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డీఆర్) 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.034 బిలియన్ డాలర్లకు, అలాగే ఐఎంఎఫ్ వద్ద నిల్వలు కూడా 2 మిలియన్ డాలర్లు తగ్గి 4.631 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

తీవ్ర ఒత్తిడిలో రూపాయి

ఇతర కరెన్సీలతో పోలిస్తే రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. ప్రధానంగా అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో గత కొన్ని నెలలుగా కనిష్ఠ స్థాయిలో జారుకుంటున్నది. దీంతో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.793 బిలియన్ డాలర్లు తరిగిపోయి 560.86 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్బీఐ తెలిపింది. డాలర్‌తోపాటు యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొనడం వల్లనే విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తులు తరిగిపోవడానికి ప్రధాన కారణమని వెల్లడించింది.

సింగిల్ చార్జింగ్‌తో 516 కిలో మీటర్లు

సరికొత్త మాడల్‌ను ప్రవేశపెట్టిన బీఎండబ్ల్యూ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ... దేశీయ మార్కెట్‌కు ఎలక్ట్రిక్ సెడాన్ ఐ5ని పరిచయం చేసింది. ఎలక్ట్రిక్ 5 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన తొలి మాడల్ ఇదే కావడం విశేషం. ఈ కారు ధర రూ.1.20 కోట్లుగా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌తో 516 కిలోమీటర్లు ప్రయాణించే ఈ కారు.. కేవలం 3.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. అలాగే గంటకు 230 కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 205కిలోవాట్ల ఏసీ చార్జర్ కలిగిన ఈ కారు బ్యాటరీ కేవలం అరగంటలోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జికానున్నది. 14.9 అంగుళాల టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, 360 డిగ్రీల్లో కెమెరా, ఎలక్ట్రికల్ అడ్జస్టబుల్ సీట్లతో రూపొందించింది.

అపోలో హెల్త్‌కోలో అడ్వెంట్‌కు వాటా

చెన్నై, ఏప్రిల్ 26: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సబ్సిడరీ సంస్థయైన అపోలో హెల్త్‌కో లిమిటెడ్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ రూ.2,475 కోట్ల పెట్టుబడులు పెట్టింది. అపోలో హెల్త్‌కో, కైమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన హోల్‌సేల్ ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలో అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు 12.1 శాతం వాటా దక్కింది. వచ్చే రెండు నుంచి రెండున్నరేండ్లలో ఈ వాటాను 100 శాతానికి పెంచుకునే అవకాశం కూడా ఉన్నది.

అదరగొట్టిన మారుతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ లాభాల్లో అదరగొట్టింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.3,877.8 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,623.6 కోట్ల లాభంతో పోలిస్తే 47.8 శాతం వృద్ధి చెందడం విశేషం. వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోవడం, కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్లనే లాభాలు పెరగడానికి దోహదం చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గత త్రైమాసికంలో సంస్థ రూ.36,697.5 కోట్ల విక్రయాలు జరిపింది.

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా సంస్థ 20 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది.
- గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.13,209.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన రూ.8,049.2 కోట్లతో పోలిస్తే 64 శాతం అధికం.
- వాహన విక్రయాలతో గతేడాది సంస్థకు రూ.1,34,937.8 కోట్ల ఆదాయం సమకూరింది. అంతక్రితం ఏడాది వచ్చిన రూ.1,12,500.8 కోట్లతో పోలిస్తే 19.9 శాతం అధికం.
- రూ.5 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.125 డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. 2022-23లో రూ.90 డివిడెండ్‌ను చెల్లించింది.

కాంక్రీట్ జంగల్‌గా దేశం

17 ఏండ్లలో 61.77 లక్షల ఎకరాల్లో నిర్మాణాలు

సగటున రోజుకు 350 ఎకరాల భూమి వినియోగం

ఇందులో మూడింట రెండు వంతులు పంట భూములే

పారిశ్రామికీకరణ, పట్టణీకర, వసతుల కల్పనే ప్రధాన కారణం

పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): 'భూమి కరుగుతున్నది.. ఊరు పెరుగుతున్నది..' ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది ఇదే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరాలు పెరగడం, మౌలిక వసతుల కల్పన, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ.. ఇలా కారణం ఏదయినా గత రెండు దశాబ్దాల్లో దేశవ్యాప్తంగా 'బిల్ట్ అప్ ఏరియా' (నిర్మాణాలు) భారీగా పెరిగింది. 2005-06 నుంచి 2022-23 వరకు జరిగిన నిర్మాణాలపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ), ఇస్రో సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేసి తాజాగా ఓ నివేదికను విడుదల చేశాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన తదితర చర్యల ఫలితంగా గత 17 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 2.5 మిలియన్ హెక్టార్లకుపైగా (61.77 లక్షల ఎకరాల) విస్తీర్ణంలో నిర్మాణాలు జరిగినట్టు ఆ నివేదిక వెల్లడించింది. భవనాలు (రూఫ్‌డ్ స్ట్రక్చర్లు), రోడ్లు, పార్కింగ్ (పేవ్‌డ్ సర్ఫేసెస్), కమర్షియల్, ఇండస్ట్రియల్ సైట్లు (పోర్టులు, ల్యాండ్ ఫిల్స్, క్వారీలు, రన్‌వేలు) లాంటి వాటిని బిల్ట్ అప్ ఏరియాగా.. పార్కులు, గార్డెన్లను అర్బన్ గ్రీన్ పార్కులుగా పేర్కొన్నది. బహుళ అంతస్థుల భవనాల రూపంలో తక్కువ స్థలంలోనే అధిక 'బిల్ట్ అప్ ఏరియా' అందుబాటులోకి వచ్చినట్టు తెలిపింది.

21 లక్షల ఎకరాల భూమి వినియోగం

బహుళ అంతస్థుల భవనాల్లో నిలువుగా అందుబాటులోకి వచ్చిన విస్తీర్ణాన్ని మినహాయిస్తే గత 17 సంవత్సరాల్లో నిర్మాణాల కోసం మొత్తం 21 లక్షల ఎకరాలకుపైగా భూమి వినియోగం జరిగినట్టు అధ్యయనాలు చెప్తున్నాయి. అంటే రోజుకు సుమారు 350 ఎకరాల భూముల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇందులో 35 శాతం (7.5 లక్షల ఎకరాలు) వ్యవసాయానికి పనికిరాని భూములు, మిగతా 65 శాతం (14 లక్షల ఎకరాలు) పంట భూములు ఉన్నట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే.. 14 లక్షల ఎకరాల పొలాలు కాంక్రీట్ జంగల్‌గా మారిపోయాయన్న మాట.

కాంక్రీట్ జంగల్‌గా మారిన 14 లక్షల ఎకరాల్లో..

- **ఏటా మూడు/రెండు పంటలు ఇచ్చే భూములు 4 లక్షల ఎకరాలు.**
- **పడావుగా వదిలేసిన భూములు 4 లక్షల ఎకరాలు.**
- **కనీసం ఒక్క పంట పండే భూములు 4 లక్షల ఎకరాలు.**
- **అటవీ భూములు 2 లక్షల ఎకరాలు.**

పెరిగిన మూలధన వ్యయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటికేడు మూలధన వ్యయాన్ని (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) పెంచడం వల్ల 'బిల్ట్ అప్ ఏరియా' పెరిగినట్టు అధ్యయనాలు చెప్తున్నాయి. ఆర్బీఐ నివేదిక ప్రకారం 2005-06లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూలధన వ్యయం కింద రూ.1.28 లక్షల కోట్లు ఖర్చు చేయగా.. 2022-23 నాటికి ఈ వ్యయం ఏకంగా రూ.11.92 లక్షల కోట్లకు పెరిగింది. ముఖ్యంగా 2019-23 మధ్య కాలంలో మూలధన వ్యయం భారీగా పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నిధులతో రోడ్లు, రైలు మార్గాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రధానంగా జాతీయ రహదారులు నిర్మించినట్టు నివేదికలు చెప్తున్నాయి.

పర్యావరణానికి విఘాతం కలుగకుండా..


దేశంలో నిర్మాణాలు శరవేగంగా పెరుగుతుండటంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక శాతం నిర్మాణాలు క్రమపద్ధతిలో కాకుండా విచ్చలవిడిగా జరుగుతుండటంతో సమతుల్యత దెబ్బతింటున్నదని, దీని వల్ల గత 17 ఏండ్లలో సుమారు 2 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చెట్లను కోల్పోయామని అంటున్నారు. మరోవైపు దాదాపు 14 లక్షల ఎకరాల పంట భూముల్లో నిర్మాణాలు జరగడంతో లక్షల మంది రైతులు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని చెప్తున్నారు. ఇది పంట దిగుబడిపై కూడా ప్రభావం చూపుతున్నదని, ఫలితంగా ఆహార ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తక్కువ స్థలంలో ఎక్కువ 'బిల్ట్ అప్ ఏరియా'ను అందుబాటులోకి తేవాలని, నిర్మాణాలు క్రమపద్ధతిలో జరిగేలా చూడాలని నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గత 17 ఏండ్లలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 'బిల్ట్ అప్ ఏరియా' పెరుగగా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, ఏపీ, మధ్యప్రదేశ్, కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో స్థిరంగా నిర్మాణాలు పెరిగినట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థికం

2047 నాటికి చేరుకుందంటున్న సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డీ ప్రసాద్

హైదరాబాద్, ఏప్రిల్ 26: తెలంగాణ రాష్ట్రం అన్ని విభాగాల్లోనూ రాణిస్తున్నది. ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగంలో అంచనాలకుమించి రాణిస్తున్న రాష్ట్రం..అటు ఆర్థికంలోనూ పెద్ద రాష్ట్రాలను తలదన్నేలా దూసుకుపోతున్నది. ఇదే క్రమంలో 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక రంగం ట్రిలియన్ డాలర్లు లేదా రూ.85 లక్షల కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) తెలంగాణ చైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.49 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నదన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.5 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ..సరాసరి 10 శాతం వృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు. ఈ లక్ష్యానికి చేరుకోవాలంటే పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, హెల్త్‌కేర్, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మూతపడుతున్న



ఎంఎస్ఎంఈలను ఆదుకోవడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందుకోసం ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలపై మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే దేశవ్యాప్తంగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు రానున్నదన్నారు. అలాగే వ్యవసాయ రంగంతోపాటు తయారీ, ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్, విద్యా, టూరిజం రంగాలను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వచ్చే ఏడాది వృద్ధి 6.5 శాతమే

వచ్చే ఏడాది భారత వృద్ధి 6.5 శాతానికి పరిమితం కానున్నదని సీఐఐ అంచనావేస్తున్నది. ఈ ఏడాదిలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసిన..సీఐఐ ఆ మరుసటి ఏడాది మాత్రం వృద్ధిలో కోత విధించింది. ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం ఇందుకు కారణమని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో సీఐఐ వైస్ చైర్మన్ ఆర్ఎస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతం సీఐఐ తెలంగాణలో 300 మంది సభ్యులు ఉన్నారని, ఈ ఏడాది మరో 50 మందిని చేర్చుకుంటున్నట్లు చెప్పారు.